నడి సంద్రంలో అగ్నికీలలు

- మెకనైజ్డ్ బోటులో అగ్నిప్రమాదం
- పూర్తిగా దగ్ధమైన బోటు
- ప్రాణభయంతో సముద్రంలో దూకేసిన మత్స్యకారులు
- మరో బోటులో తీరానికి చేరుకున్న బాధితులు



సముద్రంలో కాలిపోతున్న బోటు

వంహారాణి పేట, సెప్టెంబరు 15: చేపల వేటకు వెళ్లిన ఫిషింగ్ బోటుకు నడి సముద్రంలో అగ్ని ప్రమా దం సంభవించి మంటలు చుట్టుముట్టాయి. అందులోని ఐదుగురు మత్స్యకారులు ప్రాణభయంతో నడి సముద్రం లోకి దూకి ఈదుతూ ఒడ్డుకు చేరుకుని ప్రాణాలు దక్కిం చుకున్నారు. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు...

మత్స్యకారులు వాసుపల్లి అప్పయ్యమ్మకు చెందిన ఐఎన్‌డీఏపీవీ 5ఎంఎం 495 నంబరు గల మెకనైజ్డ్ బోటులో ఆదివారం ఐదుగురు మత్స్యకారులు హార్బర్ నుంచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్లారు. సంద్రంలో చేపలు వేటాడుతుండగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో బోటు ఇంజన్లో ఒక్కసారిగా మంటలు రేగాయి. గాలుల ధాటికి అవి ... మిగతా 6వ పేజీలో



ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారులను పరామర్శిస్తున్న మత్స్యశాఖ జేడీ విజయ

ఒకేసారి రెండు డిగ్రీలు

ఏయూలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి పీజీలో అమలుకు సన్నాహాలు



విద్యార్థికి ఆసక్తి ఉన్న రెండు కోర్సులు ఒకేసారి పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందేందుకు అవకాశం

- ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యం
- నూతన విద్యా విధానం-2020లో భాగంగా ప్రారంభం
- ఇప్పటికే ఇంజనీరింగ్‌లో మిగిలిన బ్రాంచీల విద్యార్థులకు మూడో ఏడాది సీఎస్ఈ చేసేందుకు వెసులుబాటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్న వారికి ఆశించిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించడం లేదు. దీనికి కారణం విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో నైపుణ్యాలు లేకపోవడమేనని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం-2020 పేరుతో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఒకేసారి విద్యార్థి రెండు డిగ్రీలు పొందే అవకాశాన్ని కల్పిస్తోంది. ఇప్పటికే జాతీయ వర్సిటీల్లో ఈ విధానాన్ని అమలు చేస్తుండగా, రాష్ట్ర యూనివర్సిటీల్లోనూ ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఏయూ అధికా రులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి పీజీలో డ్యూయల్ డిగ్రీ అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అంటే ఒకేసారి రెండు పీజీ కోర్సులు పూర్తిచేసే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించనున్నారు. విద్యార్థికి ఆసక్తి ఉన్న రెండు విభిన్నమైన కోర్సులను ఒకేసారి పూర్తిచేసేందుకు అవకాశం లభించనుంది. ఉదాహరణకు ఎంఏ పాలిటిక్స్ చేసే విద్యార్థి ఈ కోర్సు చదువుతూనే, ఎం.కామ్ చేసుకునే అవకాశం ఉంది. ఈ రెండు కోర్సులను ఒకేసారి పూర్తిచేసి ఒకవైపు ఎంఏ పాలిటిక్స్, మరోవైపు ఎంకామ్ డిగ్రీలను పొందవచ్చు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, అకడమిక్ సెనేట్ ఆమోదం కోసం వేచి చూస్తున్నామని, అనుమతి వచ్చిన వెంటనే ప్రారంభిస్తామని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

కోర్సులు డిజైన్ చేసే యోచన

డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను అమలు చేయాలని భావిస్తున్న ఏయూ అధికారులు ఎక్కువ మంది విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే కోర్సులను డిజైన్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. రెండు డిగ్రీలతో బయటకు వెళ్లిన వెంటనే ఏదో ఒక డిగ్రీ పట్టాతో ఉద్యోగం లభించేలా డిజైన్ చేయబోతున్నారు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌కు సంబంధించిన కోర్సులు డిజైన్, సబ్జెక్టులు, పరీక్షలు నిర్వహణ వంటి అంశాలకు సంబంధించిన కరసత్తు చేస్తున్నట్టు వర్సిటీ అధికారులు చెబుతున్నారు. రెండు మేజర్ సబ్జెక్టులు పూర్తిచేసినట్టుగానే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించనున్నారు.


ఇంజనీరింగ్‌లో అమలు..

ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రస్తుతం డ్యూయల్ డిగ్రీ విధానాన్ని అమలు చేస్తున్నారు. అయితే, పేరెంట్ డిపార్టుమెంట్ మేజర్ సబ్జెక్ట్‌గా, ఎంపిక చేసుకున్న డిపార్టుమెంట్ మైనర్ సబ్జెక్ట్‌గా ప్రస్తుతం అమలు చేస్తున్నారు. మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుతం ఈ అవకాశం కల్పిస్తున్నారు. మైనర్ డిగ్రీ పొందాలనుకునే విద్యార్థులు రెగ్యులర్ సబ్జెక్టులతోపాటు అదనంగా నాలుగు సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇనుస్ట్రుమెంటేషన్, కెమికల్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ... మిగతా 6వ పేజీలో

విద్యార్థులకు మేలుతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగు

- ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, ఏయూ వైస్ చాన్సలర్

డ్యూయల్ డిగ్రీ విధానంతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది. ఒకేసారి రెండు ప్రధానమైన డిగ్రీలను పొందడం వల్ల మార్కెట్‌లో ఏ డిగ్రీకి డిమాండ్ ఉందో దానికి సంబంధించిన ఉద్యోగాల్లో చేరేందుకు అవ కాశం ఉంటుంది. దీనివల్ల నిరుద్యోగం చాలా వరకు తగ్గుతుంది. అదే సమయంలో విద్యార్థులకు విభిన్న అంశాలపై నాలెడ్జ్ పెరుగు తుంది. ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్యార్థులకు మేజర్, మైనర్ కాన్సెప్ట్‌తో ఈ విధానాన్ని అమలు చేస్తున్నాం. మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులు మైనర్ సబ్జెక్ట్‌గా కంప్యూటర్ సైన్స్ ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాం. వచ్చే ఏడాది నుంచి పీజీ కోర్సుల్లో అమలు చేయాలని భావిస్తున్న డ్యూయల్ డిగ్రీ విధానంలో మాత్రం రెండు కోర్సులు సబ్జెక్టులు మేజర్‌గానే ఉంటాయి.



ప్రతీ శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ

ఏ సమస్య ఉన్నా 1912కు కాల్ చేస్తే చాలు

- పీఎం జన్‌మన్‌లో ఆదివాసీలకు విద్యుత్ సరఫరా
- 'ఆంధ్రజ్యోతి'తో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో ప్రతి శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపట్టాలనే నిబంధన అమలు చేస్తున్నామని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ గతంలో వేసవి సీజన్‌కు ముందు ఈ నిర్వహణ పనులు జరిగేవన్నారు. అయితే ఏడాది మొత్తం వదిలేసి, సీజన్‌లోనే చేయడం వల్ల సమస్యలు వస్తున్నాయని గుర్తించి, ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపట్టాలని ఆదేశించామన్నారు. ఎక్కడైనా చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్‌పై పడితే వెంటనే ట్రిప్ అయి సరఫరా నిలిచిపోతుందని, దీనిని సరిచేయడానికి గంటల సమయం పడుతోందన్నారు. ఇప్పుడు విద్యుత్ సరఫరా పది నిమిషాలు ఆగినా భరించలేని స్థితిలో వినియోగదారులు ఉన్నందున అసలు ఆ సమస్యే రాకుండా ముందుజాగ్రత్తగా ఇలా ప్రతి శుక్రవారం నిర్వహణ పనులు చేయిస్తున్నామన్నారు. దీనివల్ల ట్రిప్ సమస్యతో విద్యుత్ ఆగిపోయే ఘటనలు తగ్గుతున్నాయన్నారు. డిస్కమ్‌లోని అన్ని సర్కిళ్లలోను దీనిని అమలు చేస్తున్నామన్నారు.

150 ప్రాంతాల్లో పీఎం జన్‌మన్ వెలుగులు

ప్రతి ఇంటికీ విద్యుత్ సరఫరా ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం కాగా కొండల్లో నివసించే కొన్ని గిరిజన గ్రామాలకు విద్యుత్ లైన్లు వేయలేని పరిస్థితి ఉందన్నారు. పోడు వ్యవసాయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు కొండలపై నివాసాలను మార్చుకునే ఆదిమ జాతి గిరిజనులకు విద్యుత్ వెలుగులు అందించేందుకు పీఎం జన్‌మన్ పథకం అమలు చేస్తుండగా, అందులో సుమారు 150 మంది గిరిజన కుటుంబాలకు సోలార్‌తో పనిచేసే విద్యుత్ బల్బులు, ఫ్యాన్, చార్జింగ్ పాయింట్ వంటివి అందించామన్నారు. ఇవన్నీ ఒక ప్యాకేజీ కింద ఉంటాయని, ఒక్కొక్కటి రూ.50 వేలు విలువ చేస్తుందన్నారు. కేవలం సూర్యకాంతితోనే ఇవి పనిచేస్తాయన్నారు.

సేవల్లో లోపం లేకుండా చూస్తున్నాం

డిస్కమ్‌లో ఉండాల్సిన సిబ్బందిలో మూడో వంతు కొరత ఉందని, అయినా ఎక్కడా సేవలకు లోపం లేకుండా పనులు చేయిస్తున్నామని చెప్పారు. ఎటువంటి ఫిర్యాదు ఉన్నా గృహ వినియోగదారులైతే ఆరు గంటల సమయంలోనే దానిని పరిష్కరిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు వారికి ఏ సమస్య ఉన్నా 1912 నంబరుకు కాల్ చేస్తే ఫిర్యాదు స్వీకరిస్తారని, దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, వాటిని ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షిస్తుంటారని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు.

అధికారులనే సంప్రతించండి

విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి పనులు ఉన్నా స్థానికంగా ఉంటే ఏఈ కార్యాలయంలో సంప్రతించాలని, ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో వారే సూచిస్తారని సీఎండీ వివరించారు. విద్యుత్ పనులు చేయిస్తామని దళారులు చాలామంది వెంటపడతారని, వారిని నమ్మవద్దని సూచించారు. అలా చేస్తే కాలయాపనతో పాటు ఎక్కువ డబ్బు ఖర్చు అవుతుందన్నారు.

30 నుంచి రేషన్ డిపోల హేతుబద్ధీకరణ

- జిల్లాలో 413 దుకాణాల నుంచి కార్డుల విభజన
- గ్రామీణంలో 600, నగరంలో 800 కార్డులు దాటిన డిపోల గుర్తింపు
- 150 కొత్త డిపోల ఏర్పాటుకు అవకాశం



విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బియ్యంకార్డుల ప్రాతిపదికగా రేషన్ డిపోల హేతుబద్ధీకరించనున్నారు. గ్రామీణ ప్రాంతంలో 600 కార్డులు, నగరంలో 800 కార్డులు దాటిన డిపోలను హేతుబద్ధీకరించి కొత్త డిపోలు ఏర్పాటుచేస్తారు. ఈ నెలాఖరు నుంచి ప్రక్రియ ప్రారంభించి నవంబరు 23లోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. బియ్యంకార్డుల సంఖ్యను పరిగణనలో తీసుకుని కొత్త డిపోల ఏర్పాటుకు ప్రభుత్వం గత నెలలో నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి విధివిధానాలు రూపొందించి తాజాగా పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఈనెల 30న రేషనలైజేషన్‌కు అర్హత ఉన్న డిపోల వివరాలు, ఖాళీల సంఖ్యను జిల్లాల వారీగా గుర్తింపు, వచ్చే నెల మూడోతేదీన రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి, నాలుగోతేదీన కొత్తగా ఏర్పాటుకానున్న డిపోల సంఖ్యను గుర్తించాలి. దీనికి అనుగుణంగా అక్టోబరు 24న ఖాళీల సంఖ్యతోపాటు కొత్త డిపో వివరాలను ప్రకటించాలి. తరువాత దరఖాస్తులు ఆహ్వానించి నవంబరు ఏడోతేదీన రాత పరీక్ష, ఎనిమిదోతేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా 15న ప్రకటించి ఆ మరుసటి రోజు నియామకపత్రాలు అందజేయాలని, ఎంపికైన డీలర్లకు 23న ఈపోస్ మిషన్లు అందజేయాలని ఉత్తర్వుల్లో కమిషనర్ పేర్కొన్నారు.

జిల్లాలోని నాలుగు మండలాల్లో 138, నగర పరిధిలో 504 మొత్తం 642 రేషన్ డిపోలున్నాయి. గ్రామీణ ప్రాంతంలో 600 కార్డుల కంటే ఎక్కువగా 37 డిపోలున్నాయి. నగర పరిధిలో 800 కార్డుల కంటే ఎక్కువగా 376 డిపోల నుంచి కార్డులు విభజించే క్రమంలో హేతుబద్ధీకరించనున్నారు. నగరంలో 751 నుంచి 1,000 కార్డుల వరకు 197, 1,001 నుంచి 1250 వరకు 135 డిపోలు, ... మిగతా 6వ పేజీలో

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియంల తొలగింపు

- ఆదివారం సెలవు రోజు అయినా పనులు పూర్తిచేసిన అధికారులు



వన్‌టౌన్‌లోని సూపర్‌బజార్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్పులు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇకపై స్నేహపూర్వకంగా ఉండాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో అధికారులు చర్యలు చేపట్టారు. కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ ముందు ప్రత్యేకంగా పోడియంలు ఉండడంతో ప్రజలకు, అధికారులకు, ప్రభుత్వానికి మధ్య అంతరం పెరుగుతోందని భావించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రజలకు తగిన గౌరవాన్ని ఇవ్వాలన్న ఆదేశాలతో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలోనే కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఉన్న పోడియంలు తొలగించే పనులను చేపట్టారు. ఆదివారం సెలవు అయినప్పటికీ కార్యాలయాలకు వచ్చిన సబ్ రిజిస్ట్రార్లు రాత్రి వరకు దగ్గరుండి పనులు చేయించారు. వన్‌టౌన్‌లోని టర్నర్ చౌల్ట్రీ వద్ద ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అర్ధరాత్రి వరకు పనులు కొనసాగాయి.

ఏయూపై ఒత్తిళ్లు!

- పోస్టింగ్‌ల కోసం కూటమి నేతలతో పైరవీలు
- ఎగ్జామినేషన్ విభాగంలో కీలకస్థానానికి పావులు కదుపుతున్న ఉద్యోగి
- వివరాలు తెలుసుకోకుండా సిఫారసు చేసిన టీడీపీ సీనియర్ నేత
- ఆ ఉద్యోగి రెగ్యులర్ కాదని, ఆరోపణలున్నాయని తేల్చిన అధికారులు
- ఇంజనీరింగ్ విభాగంలో డీఈ పోస్టు కోసం మరొకరి ఆరాటం
- పది మంది మంత్రులతో ఉన్నతాధికారులకు ఫోన్లు
- కంటైనర్ దుకాణాల తొలగింపునకూ ఎమ్మెల్యేల మోకాలడ్డు!
- తల పట్టుకుంటున్న వర్సిటీ ఉన్నతాధికారులు



విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులకు అధికార పార్టీ నేతల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కీలక నిర్ణయాలు తీసుకోలేక సతమతమవుతున్నారు. గత పాలకుల నిర్ణయాల్లో మార్పులకు కసరత్తు చేస్తున్న సమయంలో అనూహ్యంగా కూటమి నేతల నుంచి ప్రతిబంధకా లు ఎదురవుతుండడం వారికి షాక్ కలిగిస్తోంది. దీంతో కీలక నిర్ణయాలు వాయిదా పడుతున్నట్టు సమాచారం.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి ఎగ్జామినే షన్ సెక్షన్‌లో కీలకస్థానం కోసం తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇతడిపై అనేక ఫిర్యాదులున్నాయి. అడ్డగోలు గా సంపాదించాడన్న ఆరోపణలున్నాయి. పైగా రెగ్యులర్ ఉద్యోగి కూడా కాదు. దీంతో ఫిర్యాదులను పరిశీలించిన వర్సి టీ ఉన్నతాధికారులు అతడిని పక్కన పెట్టాలని భావించారు. అయితే ఆ ఉద్యోగి ఏ పార్టీ అధికారంలో ఉన్నా మేనేజ్ చేయడంలో దిట్ట. వైసీపీ హయాంలోనూ కీలకస్థానాల్లో ... మిగతా 6వ పేజీలో

నేడు దుర్గ్-విశాఖ వందేభారత్ రైలు ప్రారంభం

- ఈ నెల 20 నుంచి రెగ్యులర్ సర్వీసులు

విశాఖపట్నం, సెప్టెంబరు 15: దుర్గ్-విశాఖతోపాటు దేశవ్యాప్తంగా మరికొన్ని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. విశాఖ-దుర్గ్ మధ్య కొత్తగా ప్రవేశపెడుతున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20 నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నది. ఈ సర్వీసులు గురువారం మినహా వారంలో ఆరు రోజులు రాకపోకలు సాగిస్తాయి. దుర్గ్-విశాఖ (నంబరు 20829) రైలు ప్రతి ఆది, సోమ, మంగళ, బుధ, శుక్ర, శనివారాల్లో ఉదయం 5.45 గంటలకు దుర్గ్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.45 గంటలకు విశాఖ చేరుతుంది. అదే రైలు నంబరు 20830తో విశాఖలో మధ్యాహ్నం 2.50 గంటలకు బయలుదేరి రాత్రి 10.50 గంటలకు దుర్గ్ చేరుతుంది. 16 కోచ్‌లతో నడిచే ఈ రైలు రాయపూర్, మహా సముంద్, ఖరియార్ రోడ్డు, కంటాబంజి, టిట్లాఘర్, కెసింగ, రాయగడ, పార్వతీపురం, విజయనగరం స్టేషన్లలో ఆగుతుంది.

విశాఖ నుంచి నాలుగో వందేభారత్ రైలు

విశాఖ నుంచి ప్రస్తుతం మూడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తుండగా, విశాఖ-దుర్గ్ మధ్య కొత్తగా ప్రవేశపెట్టే రైలు నాలుగోది కావడం విశేషం. విశాఖ-సికింద్రాబాద్-విశాఖ మధ్య రెండు రైళ్లు, విశాఖ-భువనేశ్వర్ మధ్య ఒకటి నడుస్తుండగా, నాలుగో రైలు విశాఖ-దుర్గ్-విశాఖ మధ్య అందుబాటులోకి రానుంది.

అగనంపూడిలో ఇసుక మాయం!

సుమారు 20 వేల టన్నులకు తేలని లెక్క

- విక్రయాలకు, నిల్వకు మధ్య తేడా
- నిర్దేశించిన ప్రమాణం కంటే ఎక్కువగా తరలించారనే విమర్శలు
- డిపో నిర్వాహకులు, లారీ ఓనర్ల పాత్రపై అనుమానం
- భీమిలి డిపోలో ఇసుక లెక్కలపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక



విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో భీమిలి, అగనంపూడి డిపోల్లో ఇసుక అమ్మకాల్లో తేడాలపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అగనంపూడి డిపోలో సుమారు 15 వేల నుంచి 20 వేల టన్నుల ఇసుక మాయమైందని చెబుతున్నారు. డిపోలో ఉన్న ఇసుక అమ్మకాల సమయంలో ఇష్టానుసారంగా వ్యవహరించడంతో కొందరు వ్యాపారులు, ప్రధానంగా లారీ ఓనర్ల ప్రమేయం ఉందనే వాదన వినిపిస్తోంది.**

ఇసుక లెక్కల్లో తేడాలకు సంబంధించి డిపోను నిర్వహించే రెవెన్యూ, గనుల శాఖ సిబ్బంది, కొందరు లారీ ఓనర్ల హస్తం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలావుండగా భీమిలి డిపోలో కూడా అనధికారికంగా ఇసుక తరలించారనే విమర్శల నేపథ్యంలో ఇప్పటికే జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక పంపింది.

ఈ ఏడాది జూన్‌లో ప్రభుత్వం మారిన తరువాత జిల్లాలో రెండు డిపోలను అధికారులు స్వాధీనం చేసుకుని డిపోల్లో నిల్వలపై కొలతలు వేసి భీమిలిలో 90 వేల టన్నులు, అగనంపూడిలో 92వేల టన్నుల ఇసుక నిల్వ ఉందని గనులశాఖ సిబ్బంది తేల్చారు. గత నెలలోనే భీమిలిలో ఇసుక అమ్మకాలు పూర్తిచేశారు. ఇక్కడ 90 వేల టన్నులకు గాను 40వేల టన్నుల అమ్మకాలు చేపట్టారు. డిపో పక్కన చెత్త డంపింగ్‌యార్డు నుంచి వచ్చే మురుగునీరు రావడంతో ఐదారువేల టన్నుల ఇసుక బురదమయమైంది. అయితే మిగిలిన ఇసుక విషయంలోనూ తేడాలు ఉండడంతో జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక పంపింది. డిపోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోక ముందే కొందరు స్థానిక నాయకులు రాత్రిపూట తరలించుకుపోయారని, మరికొంత ఇసుక అక్కడి నిర్వాహకులు, స్థానిక నాయకులు కలిసి అమ్ముకున్నారనే ఆరోపణలు వినిపించాయి. ఇదిలావుండగా అగనంపూడి డిపోలో 90 వేల టన్నుల నిల్వలున్నట్టు కొలతలు వేయగా ఈనెల 11వతేదీ వరకు 64వేల టన్నులు ... మిగతా 6వ పేజీలో



సంఘటన స్థలంలో విగతజీవిగా సలోమీ

వివాహిత హత్య

అనుమానంతో హతమార్చిన భర్త

- నక్కవానిపాలెంలో దారుణం
- కాకినాడ పోలీసుల ఎదుట లొంగుబాటు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 15: అనుమానం పెనుభూతమై ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను కర్కశంగా కడతేర్చాడో భర్త. ఈ దారుణ సంఘటన ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు అందించిన వివరాల మేరకు... ఉపాధి రీత్యా కాకినాడ నుంచి వలస వచ్చి నక్కవానిపాలెంలో నివాసం ఉంటున్న డానియేల్, అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు ప్రాంతానికి చెందిన చెల్లూరి సలోమీ (28) 2018లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. సలోనీ నగరంలోని ఓ హోటల్‌లో సూపర్‌వైజరుగా పనిచేస్తుండగా, డానియేల్ ఎండాడ మిరకిల్ చర్చిలో పనిచేస్తున్నాడు. కాగా భార్య ప్రవర్తనపై కొద్దికాలంగా డేనియల్‌కు అనుమానం ఉంది. దీంతో ఆమెను వేధిస్తుండేవాడు. కాగా ఆదివారం ఇంట్లో విగతజీవిగా పడిఉన్న సలోమిని చూసిన ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. డేనియల్ ఆమె మెడకు చున్నీతో ఉరివేసి హత్య చేసి కొడుకుతో సహా కాకినాడ పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు సమాచారం. అతడిని ఇక్కడి పోలీసులు నగరానికి తీసుకువస్తున్నారు. ఆ తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ మురళి వివరించారు.

నార్త్ ఏసీపీగా అప్పలరాజు




మహారాణిపేట, సెప్టెంబరు 15: విశాఖ నార్త్ ఏసీపీగా ఎస్.అప్పల రాజు నియమితులయ్యారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పలువురు పోలీసు అధికారులకు డీజీపీ ద్వారకా తిరుమలరావు స్థానచలనం చేశారు. ఈ క్రమంలో నిరీక్షణ జాబితాలో ఉన్న అప్పలరాజు విశాఖ కమిషనరేట్‌లో నార్త్ ఏసీపీగా నియమితులయ్యారు. 1991 బ్యాచ్‌కు చెందిన అప్పల రాజు విశాఖలోనే అనేక కీలక పోలీసు స్టేషన్లలో సీఐగా, ఇంటిలిజెన్స్ డీఎస్పీగా, అనకాపల్లి డీఎస్పీగా విధులు నిర్వహించారు.

అక్టోబరు 3 నుంచి నూకాంబిక ఆలయంలో దసరా ఉత్సవాలు



మురళీనగర్, సెప్టెంబరు 15 ; దసరా శరన్నవరాత్రుల సందర్భంగా విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ప్రతిష్ఠాత్మక బర్మా క్యాంప్ శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. రోజూ లలితా, నవగ్రహ, లక్ష్మీ హోమాలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు బుచ్చిబాబు శర్మ తెలిపారు. అక్టోబరు 3న బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చే అమ్మవారు, ఉత్సవాల్లో విశిష్ట అలంకరణలలో కొలువు దీరనున్నట్లు ప్రధాన అర్చకులు తెలిపారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి విశిష్ట పూజలు



జగదాంబ కూడలి, సెప్టెంబరు 15: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి ఈవో శ్రీనివాసుల రెడ్డి, జేఈవో రాంబాబు, సిబ్బంది, వేదపండితుల సమక్షంలో అమ్మవారికి విశిష్ట అలంకరణ చేసి పూజలు జరిపారు. వేదపండితులు గణపతి పూజలు, హోమం, జలాభిషేకం వంటి విశిష్ట సేవలను భక్తిశ్రద్ధలతో జరిపారు.

ఆసుపత్రులకు అవయవాలు దానం

సీతమ్మధార, సెప్టెంబరు 15: సీతమ్మధారలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఏఎస్పీ కె.ఎ.రామానుజం శనివారం మరణించారు. ఆయన ఆశయం మేరకు కళ్లను ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రికి పార్థివ దేహాన్ని ఎన్ఆర్ఐ వైద్య కళాశాలకు దానం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెక్ట్ ట్రస్టీ జి.కన్యాకుమారి, రామానుజం కుటుంబ సభ్యులు, రిటైర్డ్ ఎస్పిఆర్ ప్రసాద్, గూడూరు సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

యువత సామాజిక సేవ హర్షణీయం

మహారాణిపేట, సెప్టెంబరు 15: జేసీఐ ద్వారా సామాజిక సేవకు యువత ముందుకు రావటం హర్షణీయమని జేసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శిష్ట అనిరుద్ అన్నారు ఆదివారం రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో విశాఖ జేసీఐ, విశాఖ వ్యాలీ డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లా అధ్యక్షులు ఇంద్రజ, కార్యదర్శి సతీష్ , కె వి రావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఓనం సంబరాలు



ఓనం ముగ్గును తీర్చిదిద్దుతున్న మహిళలు

మురళీనగర్, సెప్టెంబరు 15: మురళీనగర్‌లోని కేరళ కళాసమితి అధ్వర్యంలో ఆదివారం ఓనం వేడుకలు ఘనంగా ఆరంభించారు. సమితి అధ్యక్షులు ఏఆర్‌జీ మణిఉన్నితన్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో వివిధ ప్రాంతాల నుంచి కేరళీయులు హాజరయ్యారు. వేడుకల విశిష్టతను చెప్పిన సమితి నిర్వాహకులు తొలిరోజు అతివలు, యువతులకు పూలరేకులతో ముగ్గులు, ఆహార వంటకాల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మణిఉన్నితన్ మాట్లాడుతూ 10 రోజులు జరిగే ఈ పండుగ కేరళ సంప్రదాయాల్ని గుర్తుచేస్తుందన్నారు. పంట కాలం ప్రారంభమై రుతుపవనాల ముగింపును సూచించే ఈ పండగను కేరళీయులు ఐక్యంగా జరుపకొంటామని అన్నారు. ముగింపు తిరువోణం వేడుకల్ని ఈ నెల 22న నిర్వహిస్తామన్నారు. వేడుకల్లో పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుని సంతోషంగా గడిపారు.

ఎవరికోసం ఈ ఆంక్షలు?

» 30 మీటర్ల పొడవు రోడ్డులో నాలుగు హెచ్చరిక బోర్డులు



నక్కవానిపాలెంలో ఏఎంజీ ఆసుపత్రి పక్కవీధిలో ఏర్పాటు చేసిన 'నో పార్కింగ్' హెచ్చరిక బోర్డు



సమీప వీధిలో పార్కింగ్ చేసిన వాహనాలు

సీతమ్మధార, సెప్టెంబరు 14: వాహనాలు రద్దీగా తిరిగే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులను ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేస్తారు. అయితే సొంత ప్రయోజనం, ఓ బహుళ అంతస్తులో నివాసం ఉన్న వారి కోసం ట్రాఫిక్ పోలీసులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసి స్థానిక నివాసితులను నివ్వెర పరిచారు. గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో ఏఎంజి ఆసుపత్రి పక్కరోడ్డులోని ఒక భవనంలో వాహనాల రాకపోకల కోసం సుమారు 30 మీటర్ల దూరం ఉన్న రోడ్డులో నాలుగు నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో నక్కవానిపాలెం లోపల వీధుల్లో ఉన్న వారు తమ వాహనాలను పార్కింగ్ చేయకుండా ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్ఆర్ సీపీ కార్పొరేటర్ ఇంటి పక్కన రోడ్డులో ఇలా నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామంలో లోపల వీధుల్లో నివాసం ఉంటున్న వారు తమ కార్లు, ఇతర వాహనాలను గతంలో ఆ ప్రాంతంలో పార్కింగ్ చేసేవారు. ఇప్పుడు ఆ బోర్డులకు తోడు ఎన్నికల ముందు ఆ రోడ్డుకు సమీపంలో ఉన్న ఒక అపార్టుమెంట్‌కు విచ్చేసిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు ప్రత్యేకంగా మొక్కల కుండీలు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు పక్కనే ఉన్న వీధిలో కూడా ఇలా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఆ బహుళ అంతస్తు ఎదురు రోడ్డు కూడా సుమారు 60 అడుగులు ఉంటుంది. ఆ రోడ్డులో నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఎవరి ప్రోద్బలంతో ఇలా ఏర్పాటు చేశారు? పోలీసుల ఉత్సుకత ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సొంత ప్రయోజనాల కోసం జరిమానా హెచ్చరిక బోర్డులతో బెదిరింపులకు పాల్పడటం సరికాదని స్థానికులు వాపోతున్నారు. స్థానిక నివాసితులు వాహనాలు పార్కింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇంజనీర్ల పాత్ర వెలకట్టలేనిది

» డిగ్రీ కళాశాలల కమిషనర్ డాక్టరు పోలా భాస్కర్

కంచరపాలెం, సెప్టెంబరు 15: సమాజంలో ఇంజినీర్ల పాత్ర వెలకట్టలేనిదని ఆంధ్రప్రదేశ్ డిగ్రీ కళాశాలల కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ సమాజంలో ఇంజినీర్ల పాత్ర చాలా కీలకమన్నారు.

దేశాభివృద్ధిలో ఇంజినీర్లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. అన్ని విభాగాల్లో ఇంజినీర్లు పోషిస్తున్న పాత్ర అభినందనీయమన్నారు. అనంతరం విగ్రహ ధాతలు ఎంఎస్ డి.కుమార్, ఎ.వరహాలును అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు బీవీ. లక్ష్మణరావు, డి.దామోదర్, డాక్టరు ప్రశాంతకుమారి, రిటైర్డు ప్రిన్సిపాల్ డా.బి.దేముడు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మధార: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఘనంగా నివాళులర్పించింది. ఇంజనీర్స్ డే సందర్భంగా ఆదివారం సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్, డి.సుమన్ కల్యాణి, టీవీఎస్ఎన్ మూర్తి, బి.అశోక్‌కుమార్, కార్పొరేట్ కార్యాలయం సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్‌లో విశ్వేశ్వరయ్య చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ఇంజనీర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఏపీఈపీడీసీఎల్ ఇంజనీర్లుగా ప్రతిభ చూపుతూ విశిష్ట సేవలందిస్తున్న సీజీఎంలు వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్‌లకు సీజీఎంలు డి.సుమన్ కల్యాణి, టీవీఎస్ఎన్ మూర్తి చేతుల మీదుగా జ్ఞాపికలు అందచేశారు.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న డిగ్రీ కళాశాలల కమిషనర్ పోలా భాస్కర్



తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో జ్ఞాపికలు అందుకుంటున్న అధికారులు

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

» దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జ్ఞానాపురం, సెప్టెంబరు 15: ప్రాణరక్షణ కోసమే హెల్మెట్ ధారణ తప్పని సరి చేశారని, దీనిని ఉపయోగించడం పునర్జన్మలాంటిదని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. కాన్వెంట్ కూడలిలోని విశాఖ స్కూటర్ మెకానిక్ అసోసియేషన్ 43వ వార్షికోత్సవానికి ఆదివారం ముఖ్య అతిథులుగా ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, గణబాబులు పాల్గొన్నారు. వారికి అసోసియేషన్ సభ్యులు తమ సమస్యలు వివరించారు. మెకానిక్‌లకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమను సంప్రదించాలని వారు కోరారు. సంఘం అధ్యక్షుడు రాజురెడ్డి, కార్యదర్శి డీవీవీ సత్యనారాయణ, ట్రెజరర్ శ్రీనివాసరావు, రఘురామ్. కృష్ణ, వాసు, అప్పలరాజు, అలీ మూడు జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఏయూటీడీ ఆశ్రయం



నిరాశ్రయులతో ఏయూటీడీ సిబ్బంది

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 15 : విశాఖ నగరం రోడ్లపై అనాథలు మరణిస్తే ఏయూటీడీ సంస్థలాగే చాలా మంది దహన సంస్కారాలు పూర్తి చేస్తున్నారు. కానీ చాలా మంది అభాగ్యులు బతికుండి కూడా జీవచ్ఛవాలుగా రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో తలదాచుకుంటున్నారు. అలాంటి 15 మంది నిరాశ్రయులను ఆదివారం రైల్వేస్టేషన్‌లో ఏయూటీడీ, ఆర్పీఎఫ్ సిబ్బంది కలిసి గుర్తించి టీఎస్సార్ కాంప్లెక్స్‌లో ఉన్న మహిళలు, పురుషుల షెల్టర్లకు తరలించారు. దీనిలో వివిధ జిల్లాలకు చెందిన మానసిక రోగులు, వృద్ధులు ఇళ్లు వదిలి వచ్చేసిన వ్యక్తులు ఎక్కువగా ఉన్నారు. ఏయూటీడీ సంస్థ వీరికి వైద్య సహాయం అందించి కుటుంబ సభ్యుల చెంతకు చేరుస్తోంది. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సీఐ రామకృష్ణ, ఏయూటీడీ మేనేజర్లు జ్యోతిర్మయి, భాస్కరరావు, కేర్ టేకర్లు లీల, ధనలక్ష్మి, శాంతి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో నుంచి పారిపోయిన బాలుడిని తల్లికి అప్పగించిన ఆర్పీఎఫ్



బాలుడు, తల్లితో ఆర్పీఎఫ్ సిబ్బంది

విశాఖపట్నం, సెప్టెంబరు 15: సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) హెడ్ కానిస్టేబుల్ అనిత, ఇతర కానిస్టేబుల్స్‌లో స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో వెయిటింగ్ హాలు వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న సూరత సతీష్ అనే బాలుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా తన తల్లి మందలించడంతో ఇంట్లో నుంచి పారిపోతున్నట్లుగా తెలుసుకున్నారు. దీంతో బాలుని వద్ద నుంచి తల్లి ఫోన్ నంబరు తీసుకుని సమాచారమిచ్చారు. వెంటనే స్టేషన్‌కు చేరుకున్న బాలుని తల్లి ఆర్పీఎఫ్ సిబ్బందిని కలిసి నగరంలోని సుజాతనగర్‌లో ఒక అపార్టుమెంటులో నివాసరముంటున్నామని, స్కూల్‌కు వెళ్లకపోవడంతో మందలించడంతో ముంబాయిలోని తమ బంధువుల వద్దకు పారిపోయి ప్రయత్నం చేస్తున్నాడని బాలుని తల్లి ఆర్పీఎఫ్ సిబ్బంది వివరించారు. తన భర్త, బాలుని తండ్రి ఉద్యోగ నిమిత్తం విదేశాలలో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ తన కుమారుడిని అప్పగించాలని కోరారు. దీనిపై సమగ్ర విచారణ చేసిన ఆర్పీఎఫ్ సిబ్బంది, సాక్షుల సమక్షంలో ఆ బాలుడిని తల్లికి అప్పగించారు.

'ఘంటసాల బయోపిక్ తీయడం ముదావహం'



దర్శక, నిర్మాత రామారావును సన్మానిస్తున్న సినీనటుడు ఎస్కే. మిశ్రో తదితరులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 15: ఘంటసాల జీవితాన్ని చిత్రీకరించిన గొప్పవ్యక్తి రామారావు అని సినీనటుడు, నాటక ప్రయోక్త ఎస్కే. మిశ్రో కొనియాడారు. సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల బయోపిక్ ప్రివ్యూ షో ఆదివారం శరత్ థియేటర్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా మిశ్రో మాట్లాడుతూ పాటలు పాడుతూ ఘంటసాల అందరినీ అలరించారన్నదే తెలుసనీ, వ్యక్తిగతంగా ఎన్నో బాధలు అనుభవించారన్న విషయం చాలా మందికి తెలియదన్నారు. ఘంటసాల ఆరాధన కార్యక్రమాలకర్త డా.రెహ్మతుల్లా మాట్లాడుతూ పెట్టుబడి డబ్బులు తిరిగి రావని తెలిసి బయోపిక్ తీయడం కేవలం ఘంటసాలపై ఆయనకున్న అభిమానమేనని రామారావును కొనియాడారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ ది గ్రేట్ ఘంటసాల చిత్రం చాలా అద్భుతంగా ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వప్రసాద్, కోమలి, గోపాల కృష్ణమూర్తి, విజయరమణి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి కోసం నిలదీత

జగదాంబ కూడలి, సెప్టెంబరు 14: వన్‌టౌన్ ప్రాంతంలో తాగునీటి సమస్య ఆదివారం నిలదీతల వరకు వెళ్లింది. వారం రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేక పలువార్డుల్లో ప్రజానీకం అవస్థలు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ నీటిసరఫరా విభాగం అరకొరగా నీరు విడుదల చేయడమే ఈ పరిస్థితికి కారణం. ఆదివారం 29 నుంచి 39వ వార్డు వరకు పలు ప్రాంతాల్లో కుళాయి నీటి కోసం మహిళలు పడిగాపులు పడ్డారు. పలు చోట్ల మంచినీటి ట్యాంకర్ల కోసం జనం జీవీఎంసీ సిబ్బందితో పాటు స్థానిక రాజకీయ ప్రతినిధులు, వార్డు స్థాయి నాయకులపై దూషణకు దిగారు. ట్యాంకర్ల ద్వారా ఆదివారం 30వ వార్డు పరిసర ప్రాంతాల్లో అధికారులు మంచినీరు సరఫరా చేశారు.

'ఇంద్రగంటి సేవలు చిరస్మరణీయం'

మహారాణిపేట, సెప్టెంబరు 15: ఆధ్యాత్మిక రంగానికి, సంకీర్తన వైభవానికి తనదైన శైలిలో విశిష్ట సేవలు అందించిన ఇంద్రగంటి శ్రీరామచంద్రమూర్తి చిరస్మరణీయులని ప్రముఖ గాయకుడు వి.వి. శంకరం శ్లాఘించారు. రాఘవేంద్ర స్వామి ఆలయం సమావేశమందిరంలో ఐవీఎస్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఇంద్రగంటి శ్రీరామచంద్రమూర్తి సంస్మరణ సభ నిర్వహించారు, తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ముఖ్య అతిథిగా విచ్చేసిన శంకరం మాట్లాడుతూ ఇంద్రగంటి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ తమ పరిపూర్ణమైన జీవితాన్ని సంప్రదాయ సంగీతం కోసం అంకితం చేసిన ఘనత రామచంద్రమూర్తికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కొండి వెంకటరావు, కె.సుబ్రహ్మణ్యం, పి.జగన్ ,మోహనరావు, ఆచార్య డా శ్రీనివాస్, డాక్టర్ గాయత్రి, గీత, మధుబాబు, మధుసూదనరావు, నాగేశ్వరరావు, డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అతిథులు

మహారాజుగా గణనాథుడు



ఆంధ్రజ్యోతి కార్యాలయం పక్కన లక్ష్మి వినాయక ఆలయంలో ఆదివారం గణనాథుడికి మహారాజ అవతారంలో తీర్చిదిద్దారు. భక్తులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి.

-విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి)

ఏలేరు కాలువకు గండి

» వెంటనే స్పందించిన జీవీఎంసీ అధికారులు.. గండి పూడ్చివేత



ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు

మాకవరపాలెం, సెప్టెంబరు 15: కాకినాడ జిల్లా ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖ నగరానికి తాగునీరు సరఫరా చేసే కాలువకు గండి పడింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రాచపల్లి కూడలికి సమీపంలో 99.6 కిలోమీటరు వద్ద ఆదివారం ఉదయం సుమారు పది మీటర్ల వెడల్పున భారీ గండిపడింది. అయితే పక్కనే జాగారాల గెడ్డ ఉండడంతో, నీరంతా దానిలోకి ప్రవహించడంతో పంట పొలాలు ముంపుబారిన పడలేదు. సమాచారం అందుకున్న మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు వెంటనే స్పందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్లను రప్పించి ఇసుక బస్తాలు, సరుగుడు కర్రలతో గండి పూడ్చివేత పనులు చేపట్టారు. కాగా, ఈ ప్రదేశంలో గతంలో కూడా పలుమార్లు గండ్లు పడినట్టు స్థానికులు చెబుతున్నారు. మాకవరపాలెం మండలంలో పలుచోట్ల ఏలేరు కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయని, గండ్లు పడే ప్రమాదం ఉన్నందున వీటిని పటిష్ఠం చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

నడి సంద్రంలో అగ్నికీలలు

... 5వ పేజీ తరువాయి

బోటునంతా వ్యాపించడంతో భయాందోళన చెందిన మత్స్యకారులు గురుమూర్తి, నరసింహం, రాము, సత్తయ్య, అప్పన్న సంద్రంలోకి దూకేశారు. అటుగా వస్తున్న మరో బోటు ప్రమాదాన్ని గుర్తించి, సముద్రంలో ఈదుకుంటూ ప్రాణాలు కాపాడుకోవాలని చూస్తున్న మత్స్యకారులను తమ బోటులో ఎక్కించుకుని సాయంత్రానికి క్షేమంగా ఫిషింగ్ హార్బర్‌కు చేర్చారు. సమాచారం అందుకున్న మత్స్యశాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ జి.విజయ హార్బర్‌కు చేరుకుని మత్స్యకారుల యోగ క్షేమాలను తెలుసుకున్నారు. జరిగిన ప్రమాదంపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ప్రమాదం నుంచి బయటపడిన వారిని మెకనైజ్డ్ బోటు అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణరావు, మాజీ చైర్మన్ కోలా గురువులు, చీకటి రమేష్ తదితరులు పరామర్శించారు.

బోటు ప్రమాదంపై మంత్రి అచ్చెన్న ఆరా

అమరావతి: విశాఖ సముద్రంలో చేపల వేటకు వెళ్లిన బోటులో జరిగిన అగ్ని ప్రమాదంపై వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి అచ్చెన్నాయుడు ఆరా తీశారు. బోటులో మత్స్యకారుల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐదుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని విశాఖ మత్స్యశాఖ అధికారి విజయ ఆయనకు తెలియజేశారు. బోటు ప్రమాదంతో రూ.35 లక్షల మేర ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేశారు. బోట్లకు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మత్స్యకారులకు అవగాహన పెంచాలని మంత్రి సూచించారు.

ఒకేసారి రెండు డిగ్రీలు

... 5వ పేజీ తరువాయి

కమ్యూనికేషన్, మెటలర్జీ, మెరైన్, పర్యావరణ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు మైనర్ డిగ్రీగా కంప్యూటర్ సైన్స్ అందించనున్నారు. వీరికి డేటా స్ట్రక్చర్, సీ లాంగ్వేజ్, పైథాన్, మ్యాట్ లాబ్ వంటి కోర్సులు నేర్పిస్తారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో అన్ని బ్రాంచీల విద్యార్థులకు సీఎస్ఈ చదివే అవకాశం ఇవ్వనున్నారు. మూడు, నాలుగో ఏడాదిలో మైనర్ డిగ్రీ చదివాల్సి ఉంటుంది.

30 నుంచి రేషన్ డిపోల హేతుబద్ధీకరణ

... 5వ పేజీ తరువాయి

1,251 నుంచి 1,500 కార్డుల వరకు 33 డిపోలు, 1501 కార్డుల కంటే 11 డిపోలున్నాయి. దీని ప్రకారం కొత్తగా 150 కొత్త డిపోలు వచ్చే అవకాశం ఉంది. రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తైన తరువాత దీనిపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. నగరంలో 800 కార్డులు దాటిన డిపోలు ఎక్కువగా ఆరిలోవ, మధురవాడ పరిధిలోనే ఉన్నాయి. ఇదిలావుండగా జిల్లాలో ఖాళీగా ఉన్న డిపోలపై కూడా ప్రకటన విడుదల చేయనున్నారు. అయితే గత ఏడాది 36 డిపోలకు సంబంధించి డ్వాక్రా సంఘాలు కోర్టులో వేసిన కేసు పెండింగ్‌లో ఉంది. దీనిపై ప్రభుత్వం కౌంటర్ వేయకుండా తాత్సారం చేస్తోందని అపోహలున్నాయి. డ్వాక్రాల పేరిట ఎక్కువగా బినామీలు డిపోలు నిర్వహిస్తున్నారు. ఇంకా సొసైటీల పేరిట ఉన్న డిపోలను తనిఖీ చేసి బినామీలను ఏరివేస్తే, వాటికి కూడా నోటిఫికేషన్ ఇచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఏయూపై ఒత్తిళ్లు!

... 5వ పేజీ తరువాయి

పనిచేశాడు. కూటమి ప్రభుత్వం రావడంతో మరోసారి తన మేనేజ్‌మెంట్ స్కిల్స్‌ను బయటకు తీశాడు. ఉత్తరాంధ్రకు చెందిన ఓ సీనియర్ నేతతో వర్సిటీ ఉన్నతాధికారికి ఫోన్ చేయించి, ఎగ్జామినేషన్ సెక్షన్‌లో కీలకస్థానం కోసం సిఫారసు చేయించాడు. ఆ కీలకనేతకు ఉద్యోగి అసలు రూపాన్ని వర్సిటీ ఉన్నతాధికారి తెలియజేయడంతో అవాక్కయ్యారని, దీంతో అన్నీ సవ్యంగా ఉంటేనే ఇవ్వండని చెప్పినట్టు సమాచారం. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో డీఈ పోస్టును దక్కించుకునేందుకు మరో ఉద్యోగి శ్రీకాకుళం నుంచి గుంటూరు జిల్లా వరకు సుమారు పది మంది మంత్రులతో సిఫారసు చేయించినట్టు చెబుతున్నారు. మరికొంత మంది ఎమ్మెల్యేలు కూడా ఆయనను వెంటేసుకొస్తున్నారని తెలిసింది. ఈ విషయం వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఉద్యోగి ఇంజనీరింగ్ విభాగంలో చేరడమే నిబంధనలకు విరుద్ధమని, కీలకస్థానాన్ని కట్టబెట్టేందుకు సిఫారసులు రావడం మరింత దారుణమని ఉన్నతాధికారులు వాపోతున్నారు.

కంటెయినర్ దుకాణాలకు ఎమ్మెల్యేల అండ

ఇదిలాండగా గత పాలకులు వర్సిటీలోని అనేకచోట్ల కంటైనర్ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఇష్టానుసారంగా అనుమతులిచ్చారు. తాజాగా అధికారులు వాటిని తొలగించేందుకు సిద్ధమయ్యారు. అయితే వాటి జోలికివెళ్లవద్దని నగరంలోని పలువురు ఎమ్మెల్యేల నుంచి ఫోన్లు రావడం విశేషం. మరికొందరు యూనియన్ నాయకులు కూడా తమ స్థాయిలో అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. తాము చెప్పినవారికి కీలక బాధ్యతలు అప్పగించాలంటున్నారని చెబుతున్నారు. కొన్ని సెక్షన్లలో పనిచేసే ఉద్యోగులను మార్చాలని, తాము చెప్పిన పోస్టింగ్ ఇవ్వాలని కూటమి పార్టీల అనుబంధ విభాగాల నాయకులు వర్సిటీ అధికారులను కోరుతున్నారని సమాచారం. దాదాపుగా ప్రతిరోజూ ఇదే తంతు నడుస్తుండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజా ప్రతినిధులు, అనుబంధ విభాగాలకు చెందిన నేతలు సిఫారసులు చేస్తుండడంతో పనిచేయలేని పరిస్థితి నెలకొందని ఉన్నతాధికారులు సన్నిహితుల వద్ద వాపోతున్నట్టు తెలిసింది.

అగనంపూడిలో ఇసుక మాయం!

... 5వ పేజీ తరువాయి

విక్రయించారు. వర్షం కారణంగా గ్రౌండ్ లాస్ పదివేల టన్నుల వరకు ఉంటుందని అంచనా వేశారు. మరో ఐదారువేల టన్నులు హౌసింగ్ కార్పొరేషన్ ఇళ్ల నిర్మాణాలకు ఉంచారు. స్వాధీనం చేసుకునేటప్పుడు ఉన్న నిల్వ, విక్రయాలు, గ్రౌండ్ లాస్, ఇళ్ల నిర్మాణాలకు కేటాయించగా మిగిలిన 15 వేల టన్నుల నుంచి 20 వేల టన్నుల ఇసుక ఏమైందనేది ప్రశ్న. దీనిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇసుక తేడా వ్యవహారంలో డిపో నిర్వహించే రెవెన్యూ, గనుల శాఖ సిబ్బంది, స్థానికంగా ఉన్న కొందరు లారీ ఓనర్ల హస్తం ఉందనే ప్రచారం సాగుతోంది. అగనంపూడి డిపోలో ఇసుక అమ్మకాల్లో అక్కడ సిబ్బంది, లారీ ఓనర్లు కుమ్మక్కైయ్యారనేది బహిరంగ రహస్యం. అమ్మకాల సమయంలో కొనుగోలుచేసిన దాని కంటే ఎక్కువగా ఇసుక తరలించుకుపోయారనే ఆరోపణలున్నాయి. దీనిపై అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి నివేదిక రూపొందించేపనిలో ఉన్నారు.


పిచ్చిమొక్కలను తొలగిస్తున్న గోవిందరెడ్డి, తదితరులు

శ్మశానవాటికలో శ్రమదానం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 15: పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయిన హరిజన జగ్గయ్యపాలెం లోని శ్మశానవాటికలో ఆదివారం 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డితో పాటు కాలనీ అరుంధతి సంక్షేమ సేవా సంఘం సభ్యులు శ్రమదానం చేసి శుభ్రపరిచారు. శ్మశాన రహదారితో పాటు శ్మశాన వాటికలోని తుప్పలను తొలగించడంతో పాటు వెయిటింగ్ హాల్‌లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. అనంతరం శ్మశానవాటికలో కాకి గోవిందరెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానవాటికలు, కమ్యూనిటీ హాళ్లను ప్రజలు తమ సొంత ఆస్తులుగా భావించి సంరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు వంగలపూడి గోపి, గుమ్మడి రామాంజనేయులు, నేళ్ల బుజ్జి, యు.ప్రవీణ్, ఎం.ఆనంద్, టి.వసంత్, జీవన్ బాబు, జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి శాంతి కల్యాణం


వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 15: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆదివారం శ్రీవారి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున వేంకటేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకించాక పలు రకాల పుష్పాలతో తోమాలసేవ చేసి అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను వేదికపై అధిష్ఠింపజేసి శాంతి కల్యాణాన్ని జరిపారు. పాలక మండలి సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శేషాద్రి కొండపై శ్రవణా నక్షత్రం పూజలు

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. అమెరికా నివాసితులు శ్యామ్‌ప్రకాశ్, మనీషా దంపతులు, అనిక, ప్రదీప్‌కుమార్, రాణి కుటుంబీకులు ఆర్థిక సహాయం అందజేశారు. వీరికి అర్చకులు శ్రీవారి జ్ఞాపికలను అందజేశారు. సాయంత్రం సామూహిక భక్తి గీతాలపన, విష్ణుసహస్రనామ పారాయణం చేశారు.

వాంబే కాలనీ వెంకటాద్రిపై..

పెదగంట్యాడ: శ్రీవారి జన్మ నక్షత్రం శ్రావణాన్ని పురస్కరించుకుని వాంబే కాలనీ వెంకటాద్రిపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులే స్వయంగా పంచామృతాలతో అభిషేకించారు. అర్చకులు ప్రదీప్‌చంద్ర, తాత య్యాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు.

ఇంటక్ జాతీయ నేతను కలిసిన నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 15: ఇంటక్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డిని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు, తదితరులు ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రస్తుతం స్టీల్‌ప్లాంటులో నెలకొన్న పరిస్థితులను వివరించారు. ఉక్కు కర్మాగారంలో క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, తక్షణమే ప్లాంటుకు ఆర్థిక సహాయం అవసరమని, ఇందుకోసం కేంద్రం సహకరించేందుకు తగిన కృషి చేయాలని సంజీవరెడ్డిని కోరారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49, టమాటా 34, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 64, బెండకాయలు 38, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయ 40, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 22, క్యారెట్ 35, దొండకాయలు 34, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 42, ముల్లంగి 34, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 40, వెల్లుల్లి (పెద్దవి) 280, దోసకాయలు 30, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 36, కీరదోస 32, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 54, దేముడుచిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	97
ఫారం ధర	--	117
విత్ స్కిన్	--	204
స్కిన్‌లెస్	--	214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..


గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్... పక్కన స్టేషన్ ఆవరణలో పెద్దసంఖ్యలో ఉన్న వాహనాలు

స్క్రాప్ యార్డుగా గాజువాక పోలీస్ స్టేషన్ ఆవరణ!

వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలతో నిండిపోయిన వైనం

గాజువాక, సెప్టెంబరు 15: గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్ ఆవరణ స్క్రాప్ యార్డుగా దర్శనమిస్తోంది. స్టేషన్ కాంప్లెక్స్ చుట్టూ పాడైపోయిన వాహనాలతో నిండిపోవడంతో అధ్వానంగా మారింది. మరోపక్క పోలీస్ స్టేషన్ లోపలకు వెళ్లే రహదారి పరిసరాలు మొత్తం స్టేషన్‌కు వచ్చే వారి వాహనాలతో నిండిపోవడంతో మరింత ఇబ్బందికరంగా మారుతుంది. ప్రధానంగా ఇక్కడ ఓ ఐపీఎస్ స్థాయి అధికారి పోస్టింగ్ లేకపోయినప్పటికీ అందుకోసం ఓ కూడా కార్యాలయం ఉంది. స్టేషన్ కాంప్లెక్స్ ఆవరణ చిందరవందరగా ఉండడంతో వివిధ కేసుల పనుల నిమిత్తం ఇక్కడకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ డీసీపీ, ఏసీపీ, గాజువాక శాంతిభద్రతలు, నేర, ట్రాఫిక్ విభాగాలు ఉన్నాయి.


పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలు

అయితే ఈ మూడు విభాగాలకు సంబంధించి వివిధ కేసుల్లో పట్టుబడిన ఎన్నో వాహనాలు ఇక్కడే ఉన్నాయి. ఇలా పట్టుకున్న వాహనాలను ఇతర ప్రదేశంలో పెట్టే అవకాశం లేకపోవడంతో స్టేషన్ కాంప్లెక్స్ ఆవరణలోనే ఉంచడంతో పరిసరాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. దీంతో స్టేషన్ ఆవరణ మొత్తం స్క్రాప్ యార్డుగా మారింది. ఇటీవల ఇక్కడకు విచ్చేసిన నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి స్టేషన్ కాంప్లెక్స్ ఆవరణను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. మరి స్టేషన్ పరిసరాలకు ఎప్పటికి శుభ్రంగా తీర్చిదిద్దుతారో వేచి చూడాలి.

ఉక్కు రక్షణ కోసం కూటమి ప్రభుత్వం కృషి చేయాలి

ధర్నాలో సీపీఎం నాయకులు

గాజువాక, సెప్టెంబరు 15: స్టీల్ ప్లాంటును కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తుందని, ఉక్కు రక్షణ కోసం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని సీపీఎం నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంటును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పాత గాజువాకలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్ పూర్తిగా మునగక ముందే కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి కాపాడాలన్నారు. ఎన్నికల సమయంలో స్టీల్‌ప్లాంటును కాపాడతామని ప్రకటనలు చేసిన నాయకులు ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కేంద్రంలోని పెద్దలు రోజుకొక విధంగా మాట్లాడుతూ స్టీల్ ప్లాంటును నిర్వీర్యం చేస్తున్నా రన్నారు. ఎంతోమంది ప్రాణ, త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంటును పరిరక్షించుకునేందుకు తాము ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. ప్రస్తుతం కర్మాగారంలో ఉక్కు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయిందని, అందువల్ల కేంద్రం ఆర్థిక సహకారంతో పాటు ప్రోత్సాహాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకనాథం, జగ్గునాయుడు, బి.గంగారావు, ఈశ్వరమ్మ, కేఎం శ్రీనివాస్, పి.మణి, సత్యవతి, రాంబాబు, అయోధ్యరామ్, తదితరులు పాల్గొన్నారు.


పాత గాజువాకలోని ధర్నా శిబిరంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు


గోపాలపట్నం హైస్కూల్ వెనక పైప్‌లైన్ లీక్ అవుతున్న తాగునీరు

లీక్ అవుతున్న పైపులైన్లు .. వృథాగా పోతున్న నీరు

గోపాలపట్నం, సెప్టెంబరు 15: స్థానిక జెడ్పీ హై స్కూల్ ప్రహరీకి ఆనుకుని ఉన్న తాటిపూడి పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో గత కొద్దిరోజులుగా నీరు వృథాగా పోతోంది. నీటి సరఫరా జరిగే సమయంలో పెద్దఎత్తున నీరు చిమ్ముతూ సమీపంలోని కాలువలోకి చేరుతోంది. ఈ పైప్‌లైన్ సీఎంఆర్ షాపింగ్‌మాల్‌కు ఆనుకుని కల్వర్టు దిగువ భాగంలో ఉండటంతో సమస్యను నీటి విభాగ సిబ్బంది గుర్తించలేకపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఈ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

70వ వార్డు శ్రీనివాసనగర్‌లో..

ఆటోనగర్: జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లో పైపు లైన్ లీకవ్వడంతో నీరు వృథాగా పోతోంది. గత కొంతకాలంగా ఇక్కడ తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ నీరు వృథాగా పారుతూ కాలువల్లో కలిసిపోతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.


శ్రీనివాసనగర్‌లో రోడ్డుపై పారుతున్న తాగునీరు


ఉత్తమ ఇంజనీర్లను సత్కరించిన దృశ్యం

ప్రపంచం గర్వించదగ్గ ఇంజనీర్ 'మోక్షగుండం'

ఐలా చైర్మన్ కె.సత్యనారాయణరెడ్డి

ఆటోనగర్, సెప్టెంబరు 15: ప్రపంచం గర్వించదగ్గ అతికొద్దిమంది ఇంజనీర్లలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఒకరని ఐలా చైర్మన్ కె.సత్యనారాయణరెడ్డి (రఘు) అన్నారు. ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని ఆదివారం ఆటోనగర్ ఐలా ఉద్యానవనంలోని మోక్ష గుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ ఇంజనీర్లంతా మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ మానవ వికాసం, పారిశ్రామిక అభివృద్ధిలో ఇంజనీరింగ్ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అధ్యక్షుడు సజ్జ పాండురంగప్రసాద్ మాట్లాడుతూ మేధావులైన నేటి యువత కొత్త ఆవిష్కరణల వైపు మొగ్గు చూపాలని, అప్పుడే దేశం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, తద్వారా విదేశాలకు వలసపోతున్న యువకుల సేవలు మన దేశ అభ్యున్నతికి ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఉత్తమ ఇంజనీర్లయిన పారిశ్రామికవేత్తలు యార్లగడ్డ సాంబశివరావు, ఎస్.అప్పారావు, వి.సత్యనారాయణ, ఎన్.నాగేశ్వరరావులను అతిథులు, పలువురు పారిశ్రామికవేత్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు రామకృష్ణంరాజు, బాపిరాజు, రామప్రసాద్, హనుమంతయ్య, శివయ్య, పరుచూరి ప్రభాకర్, ఈ.కృష్ణప్రసాద్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి మంచి స్పందన

అగనంపూడి, సెప్టెంబరు 15: జీవీఎంసీ 79వ వార్డు పరిధి గల్లవానిపాలెం వద్ద లయన్స్ క్లబ్, ముత్యాలహారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. 45 మంది దాతలు రక్తదానం చేశారు. తొలుత ఉక్కు విశ్రాంతి అధికారి బత్తుల కాళిదాస్ జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బలిరెడ్డి సత్యనారాయణ, గుదే సుశీలగజేంద్రరావు, హనుమంతరావు, సయ్యద్, బి.ఈశ్వరరావు, సత్యవతి, ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.

సరిపల్లిలో ఉచిత వైద్య శిబిరానికి..

పెందుర్తి: మండలంలోని సరిపల్లి జెడ్పీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. గీతం ఆస్పత్రి, గ్రామ యువత, ఇండియా ఫర్ సినెర్జీ ఫౌండేషన్, నియోలాయా సెంటర్ ఫర్ గ్లోబల్ హెల్త్ అండ్ రీసెర్చ్ (హెచ్‌యూటీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో పరిసరాల్లోని జంగాలపాలెం, నీల కంఠాపురం, చిక్కలిపేట, రాయవానిపాలెం, రాజీపేట, గుర్రంపాలెం, చింతలపాలెం, పాత పెందుర్తి గ్రామాల నుంచి వచ్చిన 650 మందికి చికిత్సలందించారు. నేత్ర, ఎముకలు, ఈఎన్‌టీ, సాధారణ వ్యాధులకు గీతం డెంటల్ కాలేజీ హెచ్‌వోడీ నాగప్రియ, ప్రొఫెసర్ సంతోష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మనోప్రభ, ప్రొఫెసర్ కృష్ణచైతన్య, ప్రొఫెసర్ చిత్ర రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. కొందరిని చికిత్స కోసం గీతం ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో సరిపల్లి యూత్, ఐఎఫ్‌వైఎస్ ఫౌండేషన్, హెచ్‌యూటీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులకు భంగం కలిగితే సహించం

ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 15: కార్మికుల హక్కులకు భంగం కలిగితే సహించేది లేదని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా యాజమాన్యం వ్యవహరిస్తుందని, దీంతో కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తున్నా కార్మికులకు మాత్రం న్యాయం జరగలేదన్నారు. కార్మిక వర్గం తీవ్ర అసహనంతో ఉందని, కార్మిక సంక్షేమంపై యాజమాన్యం దృష్టి సారించాలన్నారు. నాయకులు బీఎస్ రాజు, కొవిరి అవతారం, మంత్రి గోపినారాయణ, గంగవరం గోపి, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ మిగుల భూములను నిర్వాసితులకు కేటాయించాలి

స్టీల్‌ప్లాంట్ మిగుల భూములను నిర్వాసిత నిరుద్యోగులకు కేటాయించాలని టీఎన్‌టీయూసీ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి కోరారు. యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి లభిస్తుందన్న ఆశతో నాడు నిర్వాసితులు భూములిచ్చారని, కానీ ఇప్పటికీ చాలామందికి ఉపాధి లభించలేదన్నారు. ప్లాంట్ మిగుల భూములను కర్మాగారం అభివృద్ధికి వాడాలని, కానీ కేంద్రం స్టీల్‌ప్లాంటును విక్రయించేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు టి.శ్రీనివాస్, నరేంద్ర, శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు

మల్కాపురం, సెప్టెంబరు 15: మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ నుంచి సింధియా జంక్షన్ వరకు సెంటర్ డివైడర్‌లో జీవీఎంసీ సిబ్బంది ఎట్టకేలకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులలో భాగంగా భారీ కోలామ్స్ తీసుకురావడంతో డివైడర్ మధ్యనున్న విద్యుత్ స్తంభాలను తొలగించారు. దీంతో సుమారు ఆరేళ్లుగా ఈ మార్గంలో అంధకారం అలుముకుంది. మళ్లీ ఇన్నాళ్లకు ఈ ప్రాంతానికి వెలుగులు రానున్నాయి. ప్రస్తుతం స్తంభాల ఏర్పాటు పనులు చురుగ్గా కొనసాగించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


డివైడర్ మధ్యలో స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది


వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నాయుడు తోట రవినగర్‌లో ఐస్‌తో శివలింగం, అమ్మవారి ప్రతిమలతో పాటు దీపాలతో నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఓంకారం, వినాయక రూపాలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి.

భోజనాలకు స్టీల్ కంచాలు, గ్లాసుల వినియోగం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 15: ప్లాస్టిక్‌ను నిర్మూలించి మనల్ని మనం రక్షించుకునే ఉద్యమంలో మేముసైతమంటూ 87వ వార్డు తిరుమలనగర్ వాసులు నడుం బిగించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అలాగే గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇక్కడ నిర్వహించిన అన్న సమారాధనలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులకు బదులు స్టీల్ కంచాలు, గ్లాసులను వినియోగించారు. ఈ సమారాధనను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ ప్రారంభించారు. ఐదేళ్ల క్రితమే తిరుమల నగర్ వాసులు ప్లాస్టిక్ భూతంపై యుద్ధం ప్రకటించి, ప్లాస్టిక్ రహిత కాలనీగా మార్చడం అభినందనీయమన్నారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, మూర్తి, వసంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

వాలీబాల్ విజేతలకు బహుమతులు అందజేత

అగనంపూడి, సెప్టెంబరు 15: జనసేన అధినేత, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ 79వ వార్డు నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ వాలీబాల్ లీగ్ పోటీల్లో ఎంఎస్ఆర్ జట్టు విజతగా నిలిచింది. విజేతలకు ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు విందుల వెంకటరమణ, మేడిశెట్టి విజయ్, కర్రి దోశేంద్ర, జి.రాజు, అప్పలరాజు, కరణం సత్యారావు, కిరణ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, సెప్టెంబరు 15: జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారుల ఎంపిక ఆదివారం గాజువాకలో చేపట్టారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో జరగనున్న పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. జాతీయ స్థాయి పోటీలకు 20 మంది ఎంపికవ్వగా, వీరిలో విశాఖ నుంచే 11 మంది క్రీడాకారులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర కిక్ బాక్సింగ్ గౌరవ అధ్యక్షుడు కరణంరెడ్డి నరసింగరావు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో క్రీడాకారులంతా విజయం సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అన్ని విధాల సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జి.నూకరాజు, టీమ్ మేనేజర్ ప్రేమ్, మురళీకృష్ణ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో అలేఖ్యకు పసిడి పతకం



సింధియా, సెప్టెంబరు 15: ఇటీవల పంజాబ్‌లో కేంద్ర విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాక్సింగ్ పోటీల్లో 40, కిలోల విభాగంలో విశాఖపట్నం శాయ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సింధియా ప్రాంతానికి చెందిన వడ్డాది అలేఖ్య ఏపీ తరఫున పాల్గొని బంగారు పతకం సాధించింది. ఈ పోటీల్లో పాల్గొన్న హరియాణా, వారణాసి, అరుణచల్‌ప్రదేశ్, ఢిల్లీ, చెన్నై, ఎర్నాకుళం ప్రాంతాల వారితో అలేఖ్య తలపడి విజయం సాధించి, పంజాబ్ కేంద్ర విద్యాలయ సంస్థల చీఫ్ జనరల్ చేతుల మీదగా అందుకుంది. ఈ సందర్భంగా శాయ్ అకాడమీ కోచ్‌లు కన్నా, దుర్గారావులు అలేఖ్యను అభినందించారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు


గణేశుని సన్నిధిలో నల్లూరు సూర్యనారాయణ, తదితరులు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 15: జీవీఎంసీ 86వ వార్డు పరిధిలోని సాయి బాలాజీ నగర్, రాసాలమ్మ కాలనీ, గౌరీనగర్, లక్కరాజుపేటల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన గణనాథునికి ఆదివారం కుంకుమ పూజలు, హోమాలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు వేగుంట శ్రీనివాస్, బీఏ స్వామి, ఎం.కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

64వ వార్డులో అన్నదానం


భోజనాలు వడ్డిస్తున్న పల్లా శ్రీనివాసరావు, ఉరుకూటి చందు

గాజువాక: జీవీఎంసీ 64వ వార్డులో నిర్వహించిన అన్న సమరాధన కార్యక్రమాన్ని కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, ఉరుకూటి చందులు ప్రారంభించారు. వందలాది మంది భక్తులు విచ్చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గణేశులను దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణేశులను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దర్శించుకున్నారు. దొగ్గవానిపాలెం, శ్రమశక్తి నగర్, విద్యానగర్, సుజాతనగర్ గోకులం అపార్టుమెంట్స్, సుజాతనగర్ 80 ఫీట్ రోడ్డు 70 ప్లాట్లు, శ్రీలక్ష్మీనరసింహ టవర్స్, లక్ష్మీనగర్‌లోని సిద్ధి వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధనలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సేనాపతి శంకరరావు, 97వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు సేనాపతి సోమశేఖర్, టీడీపీ నాయకుడు దాట్ల మధు, తదితరులు పాల్గొన్నారు.

'మేహాద్రిగెడ్డ' నుంచి నీటి విడుదల నిలిపివేత

గోపాలపట్నం, సెప్టెంబరు 15: మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నుంచి వరద నీటి విడుదలను ఆదివారం నిలిపివేశారు. రిజర్వాయర్ నీటిమట్టం శనివారం ఉదయం 59.7 అడుగులకు చేరడంతో నీటిపారుదలశాఖ అధికారులు మూడో నంబర్ గేటును మూడు అంగుళాలు ఎత్తి 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆదివారం సాయంత్రానికి రిజర్వాయర్ నీటిమట్టం 59.4 అడుగులు చేరడంతో అధికారుల ఆదేశాల మేరకు గేటును దించివేశారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 61 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 59.4 అడుగుల వద్ద స్థిరీకరించారు.

నార్త్ ఏసీపీగా అప్పలరాజు




మహారాణిపేట, సెప్టెంబరు 15: విశాఖ నార్త్ ఏసీపీగా ఎస్.అప్పల రాజు నియమితులయ్యారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పలువురు పోలీసు అధికారులకు డీజీపీ ద్వారకా తిరుమలరావు స్థానచలనం చేశారు. ఈ క్రమంలో నిరీక్షణ జాబితాలో ఉన్న అప్పలరాజు విశాఖ కమిషనరేట్‌లో నార్త్ ఏసీపీగా నియమితులయ్యారు. 1991 బ్యాచ్‌కు చెందిన అప్పల రాజు విశాఖలోనే అనేక కీలక పోలీసు స్టేషన్లలో సీఐగా, ఇంటిలిజెన్స్ డీఎస్పీగా, అనకాపల్లి డీఎస్పీగా విధులు నిర్వహించారు.

అక్టోబరు 3 నుంచి నూకాంబిక ఆలయంలో దసరా ఉత్సవాలు



మురళీనగర్, సెప్టెంబరు 15 ; దసరా శరన్నవరాత్రుల సందర్భంగా విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ప్రతిష్ఠాత్మక బర్మా క్యాంప్ శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. రోజూ లలితా, నవగ్రహ, లక్ష్మీ హోమాలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు బుచ్చిబాబు శర్మ తెలిపారు. అక్టోబరు 3న బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చే అమ్మవారు, ఉత్సవాల్లో విశిష్ట అలంకరణలలో కొలువు దీరనున్నట్లు ప్రధాన అర్చకులు తెలిపారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి విశిష్ట పూజలు



జగదాంబ కూడలి, సెప్టెంబరు 15: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి ఈవో శ్రీనివాసుల రెడ్డి, జేఈవో రాంబాబు, సిబ్బంది, వేదపండితుల సమక్షంలో అమ్మవారికి విశిష్ట అలంకరణ చేసి పూజలు జరిపారు. వేదపండితులు గణపతి పూజలు, హోమం, జలాభిషేకం వంటి విశిష్ట సేవలను భక్తిశ్రద్ధలతో జరిపారు.

ఆసుపత్రులకు అవయవాలు దానం

సీతమ్మధార, సెప్టెంబరు 15: సీతమ్మధారలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఏఎస్పీ కె.ఎ.రామానుజం శనివారం మరణించారు. ఆయన ఆశయం మేరకు కళ్లను ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రికి పార్ధివ దేహాన్ని ఎన్ఆర్ఐ వైద్య కళాశాలకు దానం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెక్ట్ ట్రస్టీ జి.కన్యాకుమారి, రామానుజం కుటుంబ సభ్యులు, రిటైర్డ్ ఎస్పిఆర్ ప్రసాద్, గూడూరు సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

యువత సామాజిక సేవ హర్షణీయం

మహారాణిపేట, సెప్టెంబరు 15: జేసీఐ ద్వారా సామాజిక సేవకు యువత ముందుకు రావటం హర్షణీయమని జేసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శిష్ట అనిరుద్ అన్నారు ఆదివారం రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో విశాఖ జేసీఐ, విశాఖ వ్యాలీ డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లా అధ్యక్షులు ఇంద్రజ, కార్యదర్శి సతీష్ , కె వి రావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఓనం సంబరాలు



ఓనం ముగ్గును తీర్చిదిద్దుతున్న మహిళలు

మురళీనగర్, సెప్టెంబరు 15: మురళీనగర్‌లోని కేరళ కళాసమితి అధ్వర్యంలో ఆదివారం ఓనం వేడుకలు ఘనంగా ఆరంభించారు. సమితి అధ్యక్షులు ఏఆర్‌జీ మణిఉన్నితన్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో వివిధ ప్రాంతాల నుంచి కేరళీయులు హాజరయ్యారు. వేడుకల విశిష్టతను చెప్పిన సమితి నిర్వాహకులు తొలిరోజు అతివలు, యువతులకు పూలరేకులతో ముగ్గులు, ఆహార వంటకాల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మణిఉన్నితన్ మాట్లాడుతూ 10 రోజులు జరిగే ఈ పండుగ కేరళ సంప్రదాయాల్ని గుర్తుచేస్తుందన్నారు. పంట కాలం ప్రారంభమై రుతుపవనాల ముగింపును సూచించే ఈ పండగను కేరళీయులు ఐక్యంగా జరుపకొంటామని అన్నారు. ముగింపు తిరువోణం వేడుకల్ని ఈ నెల 22న నిర్వహిస్తామన్నారు. వేడుకల్లో పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుని సంతోషంగా గడిపారు.

ఎవరికోసం ఈ ఆంక్షలు?

▸▸ 30 మీటర్ల పొడవు రోడ్డులో నాలుగు హెచ్చరిక బోర్డులు



నక్కవానిపాలెంలో ఏఎంజీ ఆసుపత్రి పక్కవీధిలో ఏర్పాటు చేసిన 'నో పార్కింగ్' హెచ్చరిక బోర్డు



సమీప వీధిలో పార్కింగ్ చేసిన వాహనాలు

సీతమ్మధార, సెప్టెంబరు 14: వాహనాలు రద్దీగా తిరిగే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులను ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేస్తారు. అయితే సొంత ప్రయోజనం, ఓ బహుళ అంతస్తులో నివాసం ఉన్న వారి కోసం ట్రాఫిక్ పోలీసులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసి స్థానిక నివాసితులను నివ్వెర పరిచారు. గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో ఏఎంజి ఆసుపత్రి పక్కరోడ్డులోని ఒక భవనంలో వాహనాల రాకపోకల కోసం సుమారు 30 మీటర్ల దూరం ఉన్న రోడ్డులో నాలుగు నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో నక్కవానిపాలెం లోపల వీధుల్లో ఉన్న వారు తమ వాహనాలను పార్కింగ్ చేయకుండా ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్ఆర్ సీపీ కార్పొరేటర్ ఇంటి పక్కన రోడ్డులో ఇలా నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామంలో లోపల వీదుల్లో నివాసం ఉంటున్న వారు తమ కార్లు, ఇతర వాహనాలను గతంలో ఆ ప్రాంతంలో పార్కింగ్ చేసేవారు. ఇప్పుడు ఆ బోర్డులకు తోడు ఎన్నికల ముందు ఆ రోడ్డుకు సమీపంలో ఉన్న ఒక అపార్టుమెంట్‌కు విచ్చేసిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు ప్రత్యేకంగా మొక్కల కుండీలు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు పక్కనే ఉన్న వీధిలో కూడా ఇలా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఆ బహుళ అంతస్తు ఎదురు రోడ్డు కూడా సుమారు 60 అడుగులు ఉంటుంది. ఆ రోడ్డులో నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఎవరి ప్రోద్బలంతో ఇలా ఏర్పాటు చేశారు? పోలీసుల ఉత్సుకత ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సొంత ప్రయోజనాల కోసం జరిమానా హెచ్చరిక బోర్డులతో బెదిరింపులకు పాల్పడటం సరికాదని స్థానికులు వాపోతున్నారు. స్థానిక నివాసితులు వాహనాలు పార్కింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇంజనీర్ల పాత్ర వెలకట్టలేనిది

▸▸ డిగ్రీ కళాశాలల కమిషనర్ డాక్టరు పోలా భాస్కర్

కంచరపాలెం, సెప్టెంబరు 15: సమాజంలో ఇంజినీర్ల పాత్ర వెలకట్టలేనిదని ఆంధ్రప్రదేశ్ డిగ్రీ కళాశాలల కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ సమాజంలో ఇంజినీర్ల పాత్ర చాలా కీలకమన్నారు.

దేశాభివృద్ధిలో ఇంజినీర్లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. అన్ని విభాగాల్లో ఇంజినీర్లు పోషిస్తున్న పాత్ర అభినందనీయమన్నారు. అనంతరం విగ్రహ ధాతలు ఎంఎస్ డి.కుమార్, ఎ.వరహాలును అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు బీవీ. లక్ష్మణరావు, డి.దామోదర్, డాక్టరు ప్రశాంతకుమారి, రిటైర్డు ప్రిన్సిపాల్ డా.బి.దేముడు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మధార: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఘనంగా నివాళులర్పించింది. ఇంజనీర్స్ డే సందర్భంగా ఆదివారం సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్, డి.సుమన్ కల్యాణి, టీఎస్ఎన్ మూర్తి, బి.అశోక్‌కుమార్, కార్పొరేట్ కార్యాలయం సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్‌లో విశ్వేశ్వరయ్య చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ఇంజనీర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఏపీఈపీడీసీఎల్ ఇంజనీర్లుగా ప్రతిభ చూపుతూ విశిష్ట సేవలందిస్తున్న సీజీఎంలు వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్‌లకు సీజీఎంలు డి.సుమన్ కల్యాణి, టీఎస్ఎన్ మూర్తి చేతుల మీదుగా జ్ఞాపికలు అందచేశారు.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న డిగ్రీ కళాశాలల కమిషనర్ పోలా భాస్కర్



తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో జ్ఞాపికలు అందుకుంటున్న అధికారులు

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

▸▸ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జ్ఞానాపురం, సెప్టెంబరు 15: ప్రాణరక్షణ కోసమే హెల్మెట్ ధారణ తప్పని సరి చేశారని, దీనిని ఉపయోగించడం పునర్జన్మలాంటిదని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. కాన్వెంట్ కూడలిలోని విశాఖ స్కూటర్ మెకానిక్ అసోసియేషన్ 43వ వార్షికోత్సవానికి ఆదివారం ముఖ్య అతిథులుగా ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, గణబాబులు పాల్గొన్నారు. వారికి అసోసియేషన్ సభ్యులు తమ సమస్యలు వివరించారు. మెకానిక్‌లకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమను సంప్రదించాలని వారు కోరారు. సంఘం అధ్యక్షుడు రాజురెడ్డి, కార్యదర్శి డీవీవీ సత్యనారాయణ, ట్రెజరర్ శ్రీనివాసరావు, రఘురామ్. కృష్ణ, వాసు, అప్పలరాజు, అలీ మూడు జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఏయూటీడీ ఆశ్రయం



నిరాశ్రయులతో ఏయూటీడీ సిబ్బంది

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 15 : విశాఖ నగరం రోడ్లపై అనాథలు మరణిస్తే ఏయూటీడీ సంస్థలాగే చాలా మంది దహన సంస్కారాలు పూర్తి చేస్తున్నారు. కానీ చాలా మంది అభాగ్యులు బతికుండి కూడా జీవచ్ఛవాలుగా రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో తలదాచుకుంటున్నారు. అలాంటి 15 మంది నిరాశ్రయులను ఆదివారం రైల్వేస్టేషన్‌లో ఏయూటీడీ, ఆర్పీఎఫ్ సిబ్బంది కలిసి గుర్తించి టీఎస్సార్ కాంప్లెక్స్‌లో ఉన్న మహిళలు, పురుషుల షెల్టర్లకు తరలించారు. దీనిలో వివిధ జిల్లాలకు చెందిన మానసిక రోగులు, వృద్ధులు ఇళ్లు వదిలి వచ్చేసిన వ్యక్తులు ఎక్కువగా ఉన్నారు. ఏయూటీడీ సంస్థ వీరికి వైద్య సహాయం అందించి కుటుంబ సభ్యుల చెంతకు చేరుస్తోంది. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సీఐ రామకృష్ణ, ఏయూటీడీ మేనేజర్లు జ్యోతిర్మయి, భాస్కరరావు, కేర్ టేకర్లు లీల, ధనలక్ష్మి, శాంతి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో నుంచి పారిపోయిన బాలుడిని తల్లికి అప్పగించిన ఆర్పీఎఫ్



బాలుడు, తల్లితో ఆర్పీఎఫ్ సిబ్బంది

విశాఖపట్నం, సెప్టెంబరు 15: సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) హెడ్ కానిస్టేబుల్ అనిత, ఇతర కానిస్టేబుల్స్‌లో స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో వెయిటింగ్ హాలు వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న సూరత సతీష్ అనే బాలుడిని గుర్తించి అదపులోకి తీసుకుని విచారించగా తన తల్లి మందలించడంతో ఇంట్లో నుంచి పారిపోతున్నట్టుగా తెలుసుకున్నారు. దీంతో బాలుని వద్ద నుంచి తల్లి ఫోన్ నంబరు తీసుకుని సమాచారమిచ్చారు. వెంటనే స్టేషన్‌కు చేరుకున్న బాలుని తల్లి ఆర్పీఎఫ్ సిబ్బందిని కలిసి నగరంలోని సుజాతనగర్‌లో ఒక అపార్టుమెంటులో నివాసరముంటున్నామని, స్కూల్‌కు వెళ్లకపోవడంతో మందలించడంతో ముంబాయిలోని తమ బంధువుల వద్దకు పారిపోయి ప్రయత్నం చేస్తున్నాడని బాలుని తల్లి ఆర్పీఎఫ్ సిబ్బంది వివరించారు. తన భర్త, బాలుని తండ్రి ఉద్యోగ నిమిత్తం విదేశాలలో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ తన కుమారుడిని అప్పగించాలని కోరారు. దీనిపై సమగ్ర విచారణ చేసిన ఆర్పీఎఫ్ సిబ్బంది, సాక్షుల సమక్షంలో ఆ బాలుడిని తల్లికి అప్పగించారు.

'ఘంటసాల బయోపిక్ తీయడం ముదావహం'



దర్శక, నిర్మాత రామారావును సన్మానిస్తున్న సినీనటుడు ఎస్కే. మిశ్రో తదితరులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 15: ఘంటసాల జీవితాన్ని చిత్రీకరించిన గొప్పవ్యక్తి రామారావు అని సినీనటుడు, నాటక ప్రయోక్త ఎస్కే. మిశ్రో కొనియాడారు. సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల బయోపిక్ ప్రివ్యూ షో ఆదివారం శరత్ థియేటర్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా మిశ్రో మాట్లాడుతూ పాటలు పాడుతూ ఘంటసాల అందరినీ అలరించారన్నదే తెలుసనీ, వ్యక్తిగతంగా ఎన్నో బాధలు అనుభవించారన్న విషయం చాలా మందికి తెలియదన్నారు. ఘంటసాల ఆరాధన కార్యక్రమాలకర్త డా.రెహ్మతుల్లా మాట్లాడుతూ పెట్టుబడి డబ్బులు తిరిగి రావని తెలిసి బయోపిక్ తీయడం కేవలం ఘంటసాలపై ఆయనకున్న అభిమానమేనని రామారావును కొనియాడారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ ది గ్రేట్ ఘంటసాల చిత్రం చాలా అద్భుతంగా ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వప్రసాద్, కోమలి, గోపాల కృష్ణమూర్తి, విజయరమణి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి కోసం నిలదీత

జగదాంబ కూడలి, సెప్టెంబరు 14: వన్‌టౌన్ ప్రాంతంలో తాగునీటి సమస్య ఆదివారం నిలదీతల వరకు వెళ్లింది. వారం రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేక పలువార్డుల్లో ప్రజానీకం అవస్థలు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ నీటిసరఫరా విభాగం అరకొరగా నీరు విడుదల చేయడమే ఈ పరిస్థితికి కారణం. ఆదివారం 29 నుంచి 39వ వార్డు వరకు పలు ప్రాంతాల్లో కుళాయి నీటి కోసం మహిళలు పడిగాపులు పడ్డారు. పలు చోట్ల మంచినీటి ట్యాంకర్ల కోసం జనం జీవీఎంసీ సిబ్బందితో పాటు స్థానిక రాజకీయ ప్రతినిధులు, వార్డు స్థాయి నాయకులపై దూషణకు దిగారు. ట్యాంకర్ల ద్వారా ఆదివారం 30వ వార్డు పరిసర ప్రాంతాల్లో అధికారులు మంచినీరు సరఫరా చేశారు.

'ఇంద్రగంటి సేవలు చిరస్మరణీయం'

మహారాణిపేట, సెప్టెంబరు 15: ఆధ్యాత్మిక రంగానికి, సంకీర్తన వైభవానికి తనదైన శైలిలో విశిష్ట సేవలు అందించిన ఇంద్రగంటి శ్రీరామచంద్రమూర్తి చిరస్మరణీయులని ప్రముఖ గాయకుడు వి.వి. శంకరం శ్లాఘించారు. రాఘవేంద్ర స్వామి ఆలయం సమావేశమందిరంలో ఐవీఎస్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఇంద్రగంటి శ్రీరామచంద్రమూర్తి సంస్మరణ సభ నిర్వహించారు, తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ముఖ్య అతిథిగా విచ్చేసిన శంకరం మాట్లాడుతూ ఇంద్రగంటి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ తమ పరిపూర్ణమైన జీవితాన్ని సంప్రదాయ సంగీతం కోసం అంకితం చేసిన ఘనత రామచంద్రమూర్తికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కొండి వెంకటరావు, కె.సుబ్రహ్మణ్యం, పి.జగన్ ,మోహనరావు, ఆచార్య డా శ్రీనివాస్, డాక్టర్ గాయత్రి, గీత, మధుబాబు, మధుసూదనరావు, నాగేశ్వరరావు, డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అతిథులు

మహారాజుగా గణనాథుడు



ఆంధ్రజ్యోతి కార్యాలయం పక్కన లక్ష్మి వినాయక ఆలయంలో ఆదివారం గణనాథుడికి మహారాజ అవతారంలో తీర్చిదిద్దారు. భక్తులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి.
-విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి)

ఏలేరు కాలువకు గండి

▸▸ వెంటనే స్పందించిన జీవీఎంసీ అధికారులు.. గండి పూడ్చివేత



ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు

మాకవరపాలెం, సెప్టెంబరు 15: కాకినాడ జిల్లా ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖ నగరానికి తాగునీరు సరఫరా చేసే కాలువకు గండి పడింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రాచపల్లి కూడలికి సమీపంలో 99.6 కిలోమీటరు వద్ద ఆదివారం ఉదయం సుమారు పది మీటర్ల వెడల్పున భారీ గండిపడింది. అయితే పక్కనే జాగారాల గెడ్డ ఉండడంతో, నీరంతా దానిలోకి ప్రవహించడంతో పంట పొలాలు ముంపుబారిన పడలేదు. సమాచారం అందుకున్న మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు వెంటనే స్పందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్లను రప్పించి ఇసుక బస్తాలు, సరుగుడు కర్రలతో గండి పూడ్చివేత పనులు చేపట్టారు. కాగా, ఈ ప్రదేశంలో గతంలో కూడా పలుమార్లు గండ్లు పడినట్టు స్థానికులు చెబుతున్నారు. మాకవరపాలెం మండలంలో పలుచోట్ల ఏలేరు కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయని, గండ్లు పడే ప్రమాదం ఉన్నందున వీటిని పటిష్ఠం చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

నడి సంద్రంలో అగ్నికీలలు

... 5వ పేజీ తరువాయి

బోటునంతా వ్యాపించడంతో భయాందోళన చెందిన మత్స్యకారులు గురుమూర్తి, నరసింహం, రాము, సత్తయ్య అప్పన్న సంద్రంలోకి దూకేశారు. అటుగా వస్తున్న మరో బోటు ప్రమాదాన్ని గుర్తించి, సముద్రంలో ఈదుకుంటూ ప్రాణాలు కాపాడుకోవాలని చూస్తున్న మత్స్యకారులను తమ బోటులో ఎక్కించుకుని సాయంత్రానికి క్షేమంగా ఫిషింగ్ హార్బర్‌కు చేర్చారు. సమాచారం అందుకున్న మత్స్యశాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ జి.విజయ హార్బర్‌కు చేరుకుని మత్స్యకారుల యోగ క్షేమాలను తెలుసుకున్నారు. జరిగిన ప్రమాదంపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ప్రమాదం నుంచి బయటపడిన వారిని మెకనైజ్డ్ బోటు అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణరావు, మాజీ చైర్మన్ కోలా గురువులు, చీకటి రమేష్ తదితరులు పరామర్శించారు.

బోటు ప్రమాదంపై మంత్రి అచ్చెన్న ఆరా

అమరావతి: విశాఖ సముద్రంలో చేపల వేటకు వెళ్లిన బోటులో జరిగిన అగ్ని ప్రమాదంపై వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి అచ్చెన్నాయుడు ఆరా తీశారు. బోటులో మత్స్యకారుల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐదుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని విశాఖ మత్స్యశాఖ అధికారి విజయ అయనకు తెలియజేశారు. బోటు ప్రమాదంతో రూ.35 లక్షల మేర ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేశారు. బోట్లకు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మత్స్యకారులకు అవగాహన పెంచాలని మంత్రి సూచించారు.

ఒకేసారి రెండు డిగ్రీలు

... 5వ పేజీ తరువాయి

కమ్యూనికేషన్, మెటలర్జీ, మెరైన్, పర్యావరణ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు మైనర్ డిగ్రీగా కంప్యూటర్ సైన్స్ అందించనున్నారు. వీరికి డేటా స్ట్రక్చర్, సీ లాంగ్వేజ్, పైథాన్, మ్యాట్ లాబ్ వంటి కోర్సులు నేర్పిస్తారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో అన్ని బ్రాంచీల విద్యార్థులకు సీఎస్ఈ చదివే అవకాశం ఇవ్వనున్నారు. మూడు, నాలుగో ఏడాదిలో మైనర్ డిగ్రీ చదివాల్సి ఉంటుంది.

30 నుంచి రేషన్ డిపోల హేతుబద్ధీకరణ

... 5వ పేజీ తరువాయి

1,251 నుంచి 1,500 కార్డుల వరకు 33 డిపోలు, 1501 కార్డుల కంటే 11 డిపోలున్నాయి. దీని ప్రకారం కొత్తగా 150 కొత్త డిపోలు వచ్చే అవకాశం ఉంది. రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తైన తరువాత దీనిపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. నగరంలో 800 కార్డులు దాటిన డిపోలు ఎక్కువగా ఆరిలోవ, మధురవాడ పరిధిలోనే ఉన్నాయి. ఇదిలావుండగా జిల్లాలో ఖాళీగా ఉన్న డిపోలపై కూడా ప్రకటన విడుదల చేయనున్నారు. అయితే గత ఏడాది 36 డిపోలకు సంబంధించి డ్వాక్రా సంఘాలు కోర్టులో వేసిన కేసు పెండింగ్‌లో ఉంది. దీనిపై ప్రభుత్వం కౌంటర్ వేయకుండా తాత్సారం చేస్తోందని అపోహలున్నాయి. డ్వాక్రాల పేరిట ఎక్కువగా బినామీలు డిపోలు నిర్వహిస్తున్నారు. ఇంకా సొసైటీల పేరిట ఉన్న డిపోలను తనిఖీ చేసి బినామీలను ఏరివేస్తే, వాటికి కూడా నోటిఫికేషన్ ఇచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఏయూపై ఒత్తిళ్లు!

... 5వ పేజీ తరువాయి

పనిచేశాడు. కూటమి ప్రభుత్వం రావడంతో మరోసారి తన మేనేజ్‌మెంట్ స్కిల్స్‌ను బయటకు తీశాడు. ఉత్తరాంధ్రకు చెందిన ఓ సీనియర్ నేతతో వర్సిటీ ఉన్నతాధికారికి ఫోన్ చేయించి, ఎగ్జామినేషన్ సెక్షన్‌లో కీలకస్థానం కోసం సిఫారసు చేయించాడు. ఆ కీలకనేతకు ఉద్యోగి అసలు రూపాన్ని వర్సిటీ ఉన్నతాధికారి తెలియజేయడంతో అవాక్కయ్యారని, దీంతో అన్నీ సవ్యంగా ఉంటేనే ఇవ్వండని చెప్పినట్టు సమాచారం. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో డీఈ పోస్టును దక్కించుకునేందుకు మరో ఉద్యోగి శ్రీకాకుళం నుంచి గుంటూరు జిల్లా వరకు సుమారు పది మంది మంత్రులతో సిఫారసు చేయించినట్టు చెబుతున్నారు. మరికొంత మంది ఎమ్మెల్యేలు కూడా ఆయనను వెంటేసుకొస్తున్నారని తెలిసింది. ఈ విషయం వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఉద్యోగి ఇంజనీరింగ్ విభాగంలో చేరడమే నిబంధనలకు విరుద్ధమని, కీలకస్థానాన్ని కట్టబెట్టేందుకు సిఫారసులు రావడం మరింత దారుణమని ఉన్నతాధికారులు వాపోతున్నారు.

కంటెయినర్ దుకాణాలకు ఎమ్మెల్యేల అండ

ఇదిలాండగా గత పాలకులు వర్సిటీలోని అనేకచోట్ల కంటైనర్ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఇష్టానుసారంగా అనుమతులిచ్చారు. తాజాగా అధికారులు వాటిని తొలగించేందుకు సిద్ధమయ్యారు. అయితే వాటి జోలికివెళ్లవద్దని నగరంలోని పలువురు ఎమ్మెల్యేల నుంచి ఫోన్లు రావడం విశేషం. మరికొందరు యూనియన్ నాయకులు కూడా తమ స్థాయిలో అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. తాము చెప్పినవారికి కీలక బాధ్యతలు అప్పగించాలంటున్నారని చెబుతున్నారు. కొన్ని సెక్షన్లలో పనిచేసే ఉద్యోగులను మార్చాలని, తాము చెప్పిన పోస్టింగ్ ఇవ్వాలని కూటమి పార్టీల అనుబంధ విభాగాల నాయకులు వర్సిటీ అధికారులను కోరుతున్నారని సమాచారం. దాదాపుగా ప్రతిరోజూ ఇదే తంతు నడుస్తుండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజా ప్రతినిధులు, అనుబంధ విభాగాలకు చెందిన నేతలు సిఫారసులు చేస్తుండడంతో పనిచేయలేని పరిస్థితి నెలకొందని ఉన్నతాధికారులు సన్నిహితుల వద్ద వాపోతున్నట్టు తెలిసింది.

అగనంపూడిలో ఇసుక మాయం!

... 5వ పేజీ తరువాయి

విక్రయించారు. వర్షం కారణంగా గ్రౌండ్ లాస్ పదివేల టన్నుల వరకు ఉంటుందని అంచనా వేశారు. మరో ఐదారువేల టన్నులు హౌసింగ్ కార్పొరేషన్ ఇళ్ల నిర్మాణాలకు ఉంచారు. స్వాధీనం చేసుకునేటప్పుడు ఉన్న నిల్వ, విక్రయాలు, గ్రౌండ్ లాస్, ఇళ్ల నిర్మాణాలకు కేటాయించగా మిగిలిన 15 వేల టన్నుల నుంచి 20 వేల టన్నుల ఇసుక ఏమైందనేది ప్రశ్న. దీనిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇసుక తేడా వ్యవహారంలో డిపో నిర్వహించే రెవెన్యూ, గనుల శాఖ సిబ్బంది, స్థానికంగా ఉన్న కొందరు లారీ ఓనర్ల హస్తం ఉందనే ప్రచారం సాగుతోంది. అగనంపూడి డిపోలో ఇసుక అమ్మకాల్లో అక్కడ సిబ్బంది, లారీ ఓనర్లు కుమ్మక్కయ్యారనేది బహిరంగ రహస్యం. అమ్మకాల సమయంలో కొనుగోలుచేసిన దాని కంటే ఎక్కువగా ఇసుక తరలించుకుపోయారనే ఆరోపణలున్నాయి. దీనిపై అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి నివేదిక రూపొందించేపనిలో ఉన్నారు.

అర్ధనారీశ్వర గణపతిగా సంపత్ వినాయగర్



సిరిపురం, సెప్టెంబరు 15 : సిరిపురంలోని సంపత్ వినాయగర్ ఆలయంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు అర్ధనారీశ్వర గణపతిగా భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజామున ఐదు గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం నిర్వహించిన వేద సభకు సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకట రమణ హాజరయ్యారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

మధురవాడ, సెప్టెంబరు 15 : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామంలో ఆదివారం సింహాచలంకు చెందిన సరస్వతి నృత్య కళామందిర్ విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. కళాకారులు నిఖిత, భావన, మేఘన తదితరులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు.

నేడు కేంద్ర మాజీ మంత్రి టీఎస్సార్ రాక

సిరిపురం, సెప్టెంబరు 15 : కేంద్ర మాజీ మంత్రి డా. టి. సుబ్బరామిరెడ్డి సోమవారం సాయంత్రం విశాఖ రానున్నారు. మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సిరిపురంలోని టీఎస్సార్ బంగ్లాలో పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు అందుబాటులో ఉంటారు.

ఎంవీపీ కాలనీ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ ఎంపీ డాక్టర్ టి. సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడుకలను తెలుగు శక్తి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధ్యక్షుడు బీవీ రామ్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వాల్తేర్ అప్ ల్యాండ్స్ వద్ద ఉన్న టీఎస్సార్ నివాసంలో ఆ రోజు ఉదయం 9 గంటలకు వేడుకలు జరుగుతాయని చెప్పారు.

కాలనీల్లో అన్నసమారాధనలు



కొమ్మాది, సెప్టెంబరు 15 : జీవీఎంసీ 5వ వార్డు పరిధిలోని శారదానగర్, పరదేశిపాలెం, వైఎస్ఆర్ కాలనీ, పీపీ 2 కాలనీల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నసమారాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, జనసేన వార్డు అధ్యక్షుడు దేవరశివ, కొండపు రాజు పాల్గొన్నారు. కార్పెంటర్స్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో వీఎల్ఆర్ రియల్ ఎస్టేట్ అధినేత బగాది లక్ష్మణ రావు, షరీఫ్, తాటితూరి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : హెచ్‌బీ కాలనీ పాత వెంకోజీపాలెంలో వీఐపీ బాయ్స్ ఆధ్వర్యంలో ఆదివారం మహా అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాప్‌రుద్ర, టీడీపీ తూర్పు మహిళా విభాగం అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, 16వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ముగడ వాసు, నాయకులు పల్లా బాబు పాల్గొన్నారు.

సింహాచలం : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 98వ వార్డులోని కొన్ని మండపాల్లో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కాపువీధి నారసింహ యూత్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ పివి నరసింహం, అడివివరం సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, టీడీపీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్ పండాకు నంది అవార్డు

ఆరిలోవ, సెప్టెంబరు 15 :హనుమంతవాక జంక్షన్‌కు చెందిన గాయకుడు దుర్గా ప్రసాద్ పండాకు కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు,తెలుగు వెలుగు జాతీయ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా నంది పురస్కారం ప్రకటించాయి.విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఆదివారం అవార్డును ప్రదానం చేశారు. పండా సినీ ఆధ్యాత్మిక గీతాలు, జానపద గాయకుడిగా గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది.

సినిమా గైడ్

● **మత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)

● **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

● **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),

● **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49,టమాటా 34, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 64, బెండకాయలు 38, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయలు 40, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 22, క్యారెట్ 35, దొండకాయలు 34, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 120, బరబటి 42, ముల్లంగి 34, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 40, దోసకాయ 30, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 54, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	97
ఫారం ధర	--	117
విత్ స్కిన్	--	204
స్కిన్‌లెస్	--	214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..

భీమిలిలో పర్యాటక సందడి



సందర్శకులతో కిటకిటలాడుతున్న భీమిలి తీరం

భీమునిపట్నం, సెప్టెంబరు 15 : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. వారాంతపు సెలవులు కలిసి రావడంతో విజయనగరం, శ్రీకాకుళం, నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే, సన్ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు వచ్చిన 13 జిల్లాల క్రీడాకారులు కూడా బీచ్‌ను సందర్శించారు. మరోవైపు వినాయక చవితి ఉత్సవాల నిమజ్జనోత్సవాలతో తీరం సందడిగా మారింది.

జూపార్కుకు రూ. 3. 20 లక్షల ఆదాయం

ఆరిలోవ : జూపార్కు సందర్శకులతో కిటకిటలాడింది. 3,600 మంది పర్యాటకులు జూను సందర్శించగా వారి నుంచి టికెట్ల రూపంలో రూ.3.26 లక్షల ఆదాయం వచ్చింది.



పికెల్ బాల్ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా



సన్యాసిరావును సన్మానించిన ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి

అంతర్జాతీయ క్రీడలకు ప్రాచుర్యం

ఎంపీ ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఎండాడ, సెప్టెంబరు 15: అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన పికెల్ బాల్ క్రీడను నగరంలో ప్రారంభించడం ఆహ్వానించదగ్గ విషయమని ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎండాడ వైఎల్‌పీ లేఅవుట్ ప్రాంతంలో ప్రైవేట్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేసిన పికెల్ బాల్ క్రీడా ప్రాంగణాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో కొత్త క్రీడలు జీవం పోసుకుంటున్నాయని చెప్పారు. ఆరేళ్ల పిల్లల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు ఆడే విధంగా డిజైన్ చేసిన పికెల్ బాల్ క్రీడకు త్వరలో డిమాండ్ నెలకొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు డాక్టర్ శశికిరణ్, భీమిలి జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, స్థానిక కార్పొరేటర్ లొడగల అప్పారావు, నాయకులు చెట్టుపల్లి గోపి, శాఖరీ శ్రీనివాస్, బాబూరావు,మంగాదేవి పాల్గొన్నారు.

ఘనంగా సన్యాసిరావు జన్మదిన వేడుకలు

ఆరిలోవ : టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, విశాఖ జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు జన్మదిన వేడుకలు తోటగరువు ఎర్ని దుర్గమాంబ గుడి వద్ద ఉన్న కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్య అతిథులుగా హాజరై ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి, సన్యాసిరావుకి తినిపించారు. అలాగే 200 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 12వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవింద్, నాయకులు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, గాడి సత్యం, ముగడ రాజారావు, పాత్రకొండ ధర్మారావు, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన మూట్ కోర్టు పోటీలు

మధురవాడ, సెప్టెంబరు 15 : పట్టణంలోని ఎన్‌వీపీ లా కళాశాలలో నిర్వహించిన ఆళ్వార్‌దాస్ నేషనల్ మూట్‌కోర్టు పోటీల్లో విజయవాడ సిద్ధార్థ లా కళాశాల విజేతగా నిలిచింది. రెండు రోజులుగా నిర్వహించిన ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. విజేత విద్యార్థులకు రూ. 30 వేల నగదు ప్రోత్సాహకం, ట్రోఫీ అందించారు. రన్నర్స్‌గా నిలిచిన హైదరాబాద్‌కు చెందిన పెండేకంటి లా కళాశాల విద్యార్థులకు రూ.10వేలు, మెమొంటో అందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి డి.డి. ధర్మారావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్, ఎన్వీపీ లా కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్‌వీహెచ్ రాజేంద్ర, కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్ర, బోర్డు డైరెక్టర్లు విజయరవీంద్ర, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దీపికాదాస్, కళాశాల ప్రిన్సిపాల్ అలక్ చంద్రుడు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమావేశం

సాగర్‌నగర్, సెప్టెంబరు 15 : ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గం రుషికొండ సాయి ప్రియా రిసార్ట్స్‌లో ఆదివారం సమావేశమైంది. అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్ ఆర్ఎం కపరడే, నేషనల్ జనరల్ సెక్రటరీ మనోజ్‌గోయల్, ఏపీ ప్రెసిడెంట్ పి. విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ టి.వి.సంచి, నేషనల్ సెక్రటరీ జనరల్ జేకే కాంబ్లే, తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఇద్దరిని కాపాడిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 15 : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానాలకు దిగి ప్రమాదానికి గురైన ఇద్దరి పర్యాటకులను లైఫ్‌గార్డులు రక్షించారు. ఒడిశాకు చెందిన విహార యాత్రికుల్లో ఇద్దరు రుషికొండ బీచ్‌లో ఆదివారం సముద్ర స్నానాలకు దిగారు.స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన పెద్ద కెరటం నిలోయాష్ (26), మోలేషా (13) లను తాకడంతో ప్రమాదంలో పడ్డారు. కెరటాల్లో కొట్టుకుపోతున్న వారిని సమీపంలో విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డులు గమనించి, రక్షించారు.

కుళ్లిన మాంసం విక్రయిస్తే కేసులు నమోదు

ఆరిలోవ, సెప్టెంబరు 15 : కుళ్లిన తలకాయ మాంసం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని జీవీఎంసీ వెటర్నరీ ఇన్‌స్పెక్టర్లు రాము, వాసు హెచ్చరించారు. హనుమంతవాక జంక్షన్ జాతీయ రహదారి పక్కనున్న మేకల కబేళా వద్ద కుళ్లిన మేకల తలకాయ మాంసం విక్రయిస్తున్నట్టు స్థానిక జనసేన నాయకుడు బమ్మిడి ఎల్లాజీ యాదవ్ ఫిర్యాదు చేయడంతో ఆదివారం వారు తనిఖీలు చేపట్టారు. కుళ్లిన మేకల తలకాయలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని దూర ప్రాంతానికి తీసుకువెళ్లి పూడ్చిపెట్టారు. కాగా ఈ విక్రయాలపై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్పందించారు. ఇకపై ఇలాంటి మాంసం విక్రయించి ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవద్దని వారిని హెచ్చరించారు.

సంప్రదాయబద్ధంగా పవిత్రాల సమర్పణ



సింహాచలం, సెప్టెంబరు 15 : సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి పవిత్రాల సమర్పణ జరిపారు. ఉత్సవంలో భాగంగా సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. పవిత్ర సమర్పణ విశిష్టతను స్థానాచార్యులు రాజగోపాల్ మీడియాకు వివరిస్తూ శాస్త్రవిధిని అనుసరించి పవిత్రాలను పరిమిత సంఖ్య సూత్రాలతో (పట్టు దారాలతో) ఉత్తమ, మధ్యమ, అధమ అను మూడు పరిమాణాల్లో తయారు చేస్తారన్నారు. వాటిని పవిత్రోత్సవాల రెండవ రోజున అధివాసం చేసి మూడవ రోజున ఆలయంలోని మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తులకు, ఆళ్వార్లులకు, ఆలయ శిఖరాలకు సమర్పిస్తారని చెప్పారు. ఈమేరకు రాత్రి దర్శనాలు నిలిపివేసిన తరువాత విశేష హోమాలు, చతుర్వేద పారాయణలు, పురాణ, ఇతిహాది విన్నపాలు అనంతరం పవిత్ర సమర్పణ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవి రమణాచార్యులు పర్యవేక్షణలో పురోహితులు కరి సీతారామాచార్యులు, తదితరులు నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లను ఈఓ ఎస్. శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు దేవాలయ ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారులు పర్యవేక్షించారు.

గుండెపోటుతో సినీ నటుడు సూర్య ప్రసాద్ మృతి



ఆరిలోవ, సెప్టెంబరు 15 : సినీ హాస్య నటుడు కుప్పిలి సూర్యప్రసాద్ శని వారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనది హనుమంతవాక జంక్షన్ సమీపంలోని కొండవాలు ప్రాంతమైన క్రాంతినగర్ కాగా అనారోగ్యం దృష్ట్యా దొండపర్తిలో ఉన్న ఎరుకమాంబ గుడి వద్ద నివాసం ఉంటున్నారు. ఆయన సోదరుడు కేవీ రమణ బీజేపీ నాయకుడు.కాగా సూర్యప్రసాద్‌కు చిన్నతనం నుంచి నటనపై ఆసక్తి ఎక్కువ. ఆ మక్కువతోనే సుమారు 40కి పైగా చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా ప్రముఖ డైరెక్టర్ జంధ్యాల సినిమాల్లో ఎక్కువ పాత్రలు చేశారు. జంబలకిడిపంబ ఆయనకు మంచిపేరు తెచ్చి పెట్టింది. అందులో ఆయన హాస్యం బాగా పండించారు. పవన్‌కల్యాణ్ సుస్వాగతం, వివాహ భోజనంబు వంటి చిత్రాల్లోనూ నటించారు. ఉద్యోగరీత్యా హైదరాబాద్ వెళ్లలేక మంచి అవకాశాలు వచ్చినా వదులుకున్నారు. ఆయన ఏయూలో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా పని చేస్తూ 2017లో పదవీ విరమణ చేశారు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కప్ప స్తంభం ఆదాయం రూ.7.31లక్షలు

సింహాచలం, సెప్టెంబరు 15 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఖజానాకు కప్ప స్తంభం ఆలింగనాల ద్వారా గత నెలలో సుమారు రూ.7.31లక్షల ఆదాయం సమకూరింది. కప్ప స్తంభాన్ని దేవస్థానం నిర్ణయించిన రూ. 25 చెల్లించి 29, 262 వేల మంది భక్తులు ఆలింగనం చేసుకున్నారు. దీని ద్వారా స్వామివారి ఖజానాకు రూ.7,31,550 లక్షల ఆదాయం లభించింది.

మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి భవానీ దీక్ష విరమణ



భీమునిపట్నం, సెప్టెంబరు 15: మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం భవానీ దీక్ష విరమణ చేశారు. విజయవాడలో కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం దీక్షను విరమించారు. 15 ఏళ్లుగా ఆయన భవానీ దీక్ష కొనసాగిస్తున్నారు.

108 మందికి హోమియో మందులు పంపిణీ

భీమునిపట్నం, సెప్టెంబరు 15 : భీమిలిలో కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఆ సంస్థ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ఆదివారం ప్రారంభించారు. చిన్నబజారు డచ్‌వీధిలో ఆ సంస్థ ఆవరణలో వైద్యులు జగన్నాథరావు, మోహన్ 108 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కేఎస్ఎన్ మూర్తి, కేవీ భానోజీరావు, కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పూర్వ విద్యార్థినుల సమ్మేళనం



ప్రిన్సిపాల్‌కు కంప్యూటర్, ప్రింటర్స్ అందిస్తున్న పూర్వ విద్యార్థినులు

భీమునిపట్నం, సెప్టెంబరు 15 : పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల పాఠశాలలో 1983 నుంచి ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థినుల సమ్మేళనం ఆదివారం జరిగింది. సుమారు 350 మంది ఈ కార్యక్రమానికి హాజరై చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అప్పట్లో విద్యాబుద్ధులునేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాలకు రూ. లక్షల విలువైన నాలుగు ఇన్‌వెర్టర్స్, కంప్యూటర్, ప్రింటర్‌ను ప్రస్తుత ప్రిన్సిపాల్ జి. జయప్రకాష్‌కు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

డైట్ కళాశాలలో..

డైట్ కళాశాలలో 40 ఏళ్ల కిందట ఉపాధ్యాయ శిక్షణ పొందిన 70 మంది పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా, రచయిత, ఉపాధ్యాయుడు పొత్తూరు రాజేంద్ర ప్రసాద్‌వర్మ రాసిన తీయని గతం నవలను విశ్రాంత లెక్చరర్ మంథా వెంకట సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఏపీసీ శ్రీనివాసరావు, విశ్రాంత డీఈవో ఎ. సాయిబాబు, డైట్ ఇన్‌చార్జి మాణిక్యంనాయుడు, ఉపాధ్యాయులు ఎస్.కృష్ణారావు, చిలకా రమణ, బంటు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడే తత్వం అలవర్చుకోవాలి

కొమ్మాది, సెప్టెంబరు 15 : విద్యార్థి దశ నుంచి కష్టపడే తత్వాన్ని అలవరుచుకోవాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్ తెలిపారు. ఆదివారం రేవళ్లపాలెం శ్రీనివాస పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఇప్పటి నుంచి ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల గాథలపై విద్యార్థుల పంపిన వీడియో క్లిపింగ్‌ల్లో ఎంపిక చేసిన విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్, ఉదయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి



శివాజీ పార్కులో సమావేశమైన చిరు వ్యాపారులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 15 : ప్రభుత్వం చిరు వ్యాపారులను ప్రోత్సహించాలని నగరంలోని పలు ప్రాంతాల వ్యాపారులు కోరారు. ఆదివారం వారు శివాజీ పార్కులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకార్పొరేట్ కంపెనీల మాల్స్, సూపర్ మార్కెట్లు తమ పొట్ట కొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తులు అందించే సంస్థలు కూడా పెద్ద వ్యాపారులకు ఒక ధర, చిరు వ్యాపారులకు మరో ధరకు విక్రయించడం అన్యాయమని పేర్కొన్నారు. వారికి తక్కువ ధరకు ఉత్పత్తులు ఇవ్వడం వల్ల వినియోగదారుల దృష్టిలో చిరు వ్యాపారులు దొంగల్లా కనిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ చూపి అందరికీ ఒకే మార్జిన్ ఉండేలా చూడాలని కోరారు.

రాష్ట్రస్థాయి యోగాసన పోటీల విజేత విశాఖ



విశాఖ జట్టుకు షీల్డ్ బహూకరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, సెప్టెంబరు 15 : పట్టణంలోని ది సన్ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను విశాఖ జిల్లా కైవసం చేసుకుంది. రెండు రోజుల పాటు కొనసాగిన ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మొదటి స్థానంలో భీమిలి, రెండో స్థానంలో కృష్ణా, మూడో స్థానంలో కర్నూలు జిల్లాలు నిలిచాయి. విజేతలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బహుమతులందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగా సాధన చేస్తే ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ కూడా అలవడుతుందన్నారు. జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు రవి శ్రీనివాస్ మాట్లాడుతూ పోటీల్లో 13 జిల్లాల నుంచి 473 మంది పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ది సన్ స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, బీజేపీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, రాష్ట్ర యోగా స్పోర్ట్సు అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ఏఆర్‌కే వర్మ, కార్యదర్శి ఎం. అవినాష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి శ్రీనివాస్, రామారావు, సహాకార్యదర్శి ఎన్. శ్రీనివాస్, కృష్ణా జిల్లా అసోసియేషన్ కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు

కొమ్మాది, సెప్టెంబరు 15 : గంజాయి రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని నార్త్ జోన్ ఇన్‌చార్జి ఏసీపీ వెంకట్రావు తెలిపారు. ఆదివారం ఆయన పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో సీఐ బాలకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దేవిమెట్టలో రేకులషెడ్‌లో విక్రయం కోసం నిల్వ ఉంచిన రెండు కిలోల గంజాయితో పాటు చోరీకి గురైన మూడు బైక్‌లను స్వాధీనం చేసుకుని, నిందితుడ్ని జ్యూడిషియల్ కస్టడీకి పంపినట్టు చెప్పారు. డెంకాడ మండలం మోదివలస గొండ య్యపాలెంకు చెందిన వై. కృష్ణబాబు ఇంటర్ వరకు చదువుకున్నాడు. చదువుకున్న రోజుల్లోనే చెడు వ్యసనాలకు బానిస కావడంతో డబ్బు కోసం దొంగతనాలకు అలవాడు పడ్డాడు. అతనిపై విజయనగరం, డెంకాడ, పీఎంపాలెం, భీమిలి స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి. భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఇంటి చోరీ కేసులో జైలుకు వెళ్లి గత నెలలో బయటకు వచ్చాడు. జైలులో పరిచయం అయిన కోనాడ రాంబాబుతో కలిసి ఆరిలోవలో ఒక బైక్, విజయనగరంలో ఒక బైక్, ఆనందపురం సబ్‌స్టేషన్ వద్ద మరో బైక్ దొంగతనం చేశారు. వెంటనే అమ్మితే పోలీసులకు దొరికిపోతాం అన్న ఉద్దేశంతో వాటిని కొమ్మాది శివారు దేవిమెట్ట వద్ద ఒక పాడుబడిన రేకుల షెడ్‌లో ఉంచాడు. అక్కడ బైక్‌లతో పాటు రెండు కిలోల గంజాయి కూడా ఉంచడంతో స్థానికుల సమాచారం మేరకు పీఎంపాలెం పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని, వారిని అరెస్టు చేశారు.

క్రీడా పోటీల్లో మాజీ సైనికుడి ప్రతిభ



పతకాలు సాధించిన విజయ నరసింహరాజు

కొమ్మాది, సెప్టెంబరు 15 : బక్కన్నపాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు రేపాక విజయ నరసింహరాజు ఎస్‌బీఐకే, భారతీయ ఖేల్ ఫౌండేషన్ సంయుక్తంగా నేపాల్‌లోని పోక్రాలో గత నెల 31 నుంచి ఈనెల 4 వరకు నిర్వహించిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో (230 కిలోల విభాగం) బంగారు పతకం గెలుపొందారు. అలాగే జావిలిన్‌లో బంగారు పతకం, షాట్‌పుట్‌లో సిల్వర్ పతకం సాధించారు. ఆయన భార్యవిమల కూడా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం,షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. పోటీలకు భారత్ నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొనగా భూటాన్, నేపాల్, శ్రీలంక దేశాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పలు పతకాలు సాధించిన భార్యభర్తలను మధురవాడ ప్రాంతానికి చెందిన మాతృశ్రీ ట్రస్టు సభ్యులు రామారావు, శివతో పాటు పలువురు అభినందించారు.

ముచ్చెర్లలో జ్వరాలు విజృంభణ

ఆనందపురం, సెప్టెంబరు 15 : మండలంలోని ముచ్చెర్ల గ్రామంలో జ్వరాలు విజృంభించాయి. ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు మంచం పట్టారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో కాలువల్లో మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇటీవల పడిన వర్షాలకు నీరు నిలిచి వ్యాధులు మరింత ప్రబలుతున్నట్టు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో జ్వరాలు ఎక్కువగా ఉన్నా.. పీహెచ్‌సీ సిబ్బంది స్పందించకపోవడంపై పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు పెంచాలి'

మధురవాడ, సెప్టెంబరు 15 : వచ్చే ఏడాది జనవరి 18న జరిగే నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువును పెంచాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో నవోదయ విద్యాలయ సమితి ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఈనెల 16తో దరఖాస్తుల స్వీకరణకు ఆఖరి తేదీగా పేర్కొన్నారని, దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించినపుడు సాంకేతిక సమస్యలు ఏర్పడడంతో చాలామంది సకాలంలో దరఖాస్తు చేయలేకపోయారన్నారు. ఈనేపథ్యంలో నవోదయ విద్యాలయ సమితి, కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి స్పందించి దరఖాస్తులు చేసే తుది గడువు పెంచాలని ఆయన కోరారు.

తిమ్మాపురం బీచ్‌లో స్వచ్ఛభారత్

భీమునిపట్నం, సెప్టెంబరు 15 : తిమ్మాపురం తీరంలో ఆదివారం ప్లాటిపస్ ఎస్కేప్స్ స్కూబా డైవర్స్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మేడపాటి ఆధ్వర్యంలో స్వచ్ఛ్‌సాగర్ - స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓషన్ కన్జర్వేషన్ సంస్థ, గీతం విశ్వవిద్యాలయం, విజయనగరం రఘు, విశాఖ బుల్లయ్య కళాశాలల విద్యార్థుల సహకారంతో తీరంలో పేరుకుపోయిన 2,100 కిలోల చెత్తను తొలగించారు.

ఘనంగా ఇంజనీర్స్ దినోత్సవం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 15 : ఏయూలో ఆదివారం ఇంజనీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్. కిశోర్‌బాబు ఇంజనీర్స్ కార్యాలయం వద్ద ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏయూ చీఫ్ ఇంజనీర్ తిరుపతిరావు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, పలువురు డీన్లు, డైరెక్టర్లు, ఆచార్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.